
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 28 జూలై 2024



మాలకొండ ఆదాయం రూ.7,83,556


వలేటివారిపాలెం, జూలై 27 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.7,83,556 ఆదాయం లభించినట్లు ఆ ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,31,500, అన్నదానం ద్వారా రూ.2,15,264, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,89,885, విరాళాల ద్వారా రూ. 38,282, తలనీలాలు రూ.40,375, రూముఅద్దెలు రూ.27,910, కుంకుమార్చన రూ. 21,880, అష్టోత్తరం టికెట్ల రూ.7,300, వివాహాలు రూ.1000, వాహనపూజలు రూ.4,300, స్థలపురాణం పుస్తకాలు విక్రయం రూ.760, కవర్లు రూ.5,100 లభించినట్లు ఆయన పేర్కొన్నారు.

నామినేటెడ్ పదవుల కేటాయింపులో టీడీపీ అధిష్ఠానం నిర్ణయం

సిఫారసులు లేవు..

పనితీరే ప్రామాణికం

తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం నామినేటెడ్ పోస్టుల భర్తీకి పెద్ద ఎత్తున కసరత్తు మొదలు పెట్టింది. ఈసారి ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసులకు తావివ్వకుండా కేవలం అర్హత, స్థాయి ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించుకుంది. ఆశావహుల జాబితాను వడపోయడం కోసం ప్రత్యేకంగా ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేసి, ఆరా తీస్తోంది. మరోవైపు ఈ నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారన్న బలమైన సంకేతాలు అందడంతో జిల్లా నుంచి వందల సంఖ్యలో నాయకులు రాజధాని అమరావతికి క్యూ కడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీవెన్స్ వెళ్లి పార్టీ కోసం తాము కష్టపడిన తీరును వివరిస్తూ అభ్యర్థిస్తున్నారు.



- అర్హత కొలమానానికి ప్రత్యేక బృందం
- గతానికి భిన్నంగా భారీగా పెరిగిన ఆశావహులు
- సీఎం గ్రీవెన్స్‌కు పెరుగుతున్న క్యూ
- జనసేన, బీజేపీలకు దామాషా మేరకు పోస్టులు
- ఆ పార్టీల అగ్రనేతల సూచనల మేరకు కేటాయింపులు

నెల్లూరు. జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు నామినేట్ పోస్టుల భర్తీ చేయడం ఆనవాయితీ. అయితే తెలుగుదేశం అధిష్ఠానం ఈసారి ఆ పద్ధతిలో మార్పు తెచ్చింది. సిటింగ్ ఎమ్మెల్యేలు లేదా నియోజకవర్గ ఇన్‌చార్జుల సిఫారసులను పరిగణలోకి తీసుకుంటే నిజంగా పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరిగే అవకాశం ఉందని భావించింది. దీనికి పరిష్కారంగా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సిఫారసు చేసిన అభ్యర్థులతో పాటు నిజంగా పార్టీకి పనిచేసిన నాయకుల పేర్లను కూడా పరిగణలోకి తీసు కొని జాబితాను వడపోస్తున్నారు. నామినేటెడ్ పదవికి ఎవరు అర్హులు? ఆ నాయకుడి రాజకీయ చరిత్ర, పార్టీ కార్యక్రమాల్లో ఎలా పనిచేశారు? పార్టీ పట్ల ఉన్న నిబద్ధత, ఏ స్థాయి పదవికి అర్హుడు తదితర అంశాలను పరిశీలించడానికి ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృంద సభ్యులు వివిధ మార్గాల ద్వారా ఆశావహుల సమాచారం తెప్పించుకొంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరగకుండా చూడటంతోపాటు నేర ప్రవృత్తి, సమాజంలో చెడ్డ పేరు కలిగిన వారికి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఈ వడబోత కార్యక్రమం జరుగుతున్నట్టు సమాచారం.

● దామాషా ప్రకారం పదవులు



నామినేటెడ్ పదవుల్లో కూటమిలోని జనసేన, బీజేపీలకు చెందిన నాయకులకు పొత్తుల దామాషా ప్రకారం పదవులు కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రతి జిల్లా పరిధిలో మొత్తం నామినేటెడ్ పదవుల్లో జనసేన, బీజేపీ నాయకులకు కొన్ని కేటాయించనున్నారు. ఎవరికి కేటాయించాలి, ఏ పదవులు కేటాయించాలి అనే విషయాన్ని ఆయా పార్టీల అగ్రనేతలు టీడీపీ అధిష్ఠానం ముందుకు తీసుకొస్తున్నారు. దీనిపై మూడు పార్టీల నాయకులు చర్చించుకొని సర్దుబాటు చేసుకుంటారు.

● రోజుల వ్యవధిలో భర్తీ!?

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ ద్వితీయ శ్రేణి నాయకులు అమరావతికి క్యూకడుతున్న తీరు నామినేటెడ్ పోస్టుల భర్తీకి మరెంతో దూరం లేదనే విషయాన్ని తెలియజేస్తోంది. ఈ నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారం నుంచి దశల వారీగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారని సమాచారం. ఈ క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాల వద్ద ఆశావహుల హడావుడి ఊపందుకుంది.



ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పడాలని తాపత్రయపడుతున్నారు. ముఖ్యమంత్రి దర్శనం కోసం ఆయన నివాసం ముందు వాలిపోతున్నారు. గత ఐదు రోజులుగా నెల్లూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు వందల సంఖ్యలో నాయకులు తరలి వెళుతున్నారు. పార్టీ కోసం, గెలుపు కోసం తాముపడిన కష్టాన్ని గుర్తు చేస్తూ న్యాయం చేయమని అభ్యర్థిస్తున్నారు. బుధ, గురువారాల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి దాదాపు 300 మందికిపైగా సీఎం గ్రీవెన్స్‌కు వెళ్లారంటే నామినేటెడ్ పోస్టులకు డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

ఈసారి టౌన్‌ప్లానింగ్‌లో..

ఫోర్జరీ కేసులో పోలీసుల విచారణ

అధికారులు, సిబ్బందిపై ప్రశ్నల వర్షం

నెల్లూరు (క్రైం), జూలై 27 : నెల్లూరు కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే కేసు నమోదు చేసి ఆరుగురు నిందితుల కోసం మూడు బృందాలు గాలిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో కార్పొరేషన్‌లో పలువురు అధికారులు, సిబ్బంది హస్తం ఉందని భావించిన పోలీసు అధికారులు ఆ కోణంలో విచారణ వేగవంతం చేశారు. ఇటీవల కార్యాలయంలోని పలు విభాగాల్లో నగర డీఎస్పీ డి శ్రీనివాసులరెడ్డి విచారించి విషయం తెలిసిందే. అయితే శనివారం ఉదయం నుంచి డీఎస్పీతోపాటు పలువురు పోలీసు అధికారులు కార్పొరేషన్ కార్యాలయంలోని ప్లానింగ్ విభాగంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. పలు అంశాలపై అధికారులు, సిబ్బందిని విచారించారు. ఈ పరిణామాలు చూస్తుంటే ఈ కేసులో మేయర్ భర్త జయవర్ధన్, మరో ఐదుగురితోపాటు కార్పొరేషన్‌లో పలువురు అధికారులు, సిబ్బందిపై కూడా కేసులు నమోదు చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

వచ్చే నెల పదిన జడ్పీ సమావేశం

● పలు శాఖలపై విస్తృత చర్చ


నెల్లూరు (జడ్పీ), జూలై 27: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు సీఈవో కన్నమ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమైందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమాలతోపాటు, జలవనరుల శాఖపై కూడా సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జోన్-3 సిబ్బంది

ఉత్సాహంగా ఆర్టీసీ జోన్ క్రీడలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 27: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఆర్టీసీ జోన్-3 పరిధిలోని ఐదు జిల్లాలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది స్పోర్ట్స్‌మీట్-24 పోటాపోటీగా జరిగింది. అథ్లెటిక్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉద్యోగులు వయసును మరిచి తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ముందుగా ఉదయం ఈ పోటీలను ఈడీ కె ఆదామ్ సాహెబ్ ప్రారంభించి, ప్రసంగించారు. జోన్ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ చూపిన వారు సెప్టెంబరులో జరిగే జాతీయ స్థాయి ఆర్టీసీ స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొంటారని తెలిపారు.



శ్రీశైలం డ్యాం

- శ్రీశైలంలో 866 అడుగులు దాటిన నీటిమట్టం
- 2లక్షల క్యూసెక్కులకుపైగా వస్తున్న వరద
- 'సోమశిల'కు తరలింపునకు ఇదే అవకాశం
- జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించాలి
- అవకాశాన్ని అందిపుచ్చుకుంటే మంచి ఫలితం
- ఆశగా ఎదురుచూస్తున్న జిల్లా రైతాంగం



సోమశిల జలాశయం

ఇదే అదును..

కృష్ణమ్మను ఆహ్వానిద్దాం!

కృష్ణా, గోదావరి క్యాచ్‌మెంట్లలో కురుస్తున్న భారీ వర్షాలు జిల్లాను పులకరింపజేస్తున్నాయి. పెన్నా క్యాచ్‌మెంట్‌లో వర్షాలు కురవకపోయినా.. సోమశిల, కండలేరు జలాశయాలు డెడ్‌స్టోరేజీలో ఉన్నా శ్రీశైలం జలాశయానికి భారీ వరద కొనసాగుతుండటంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. ఈ ఆనందం కొనసాగాలంటే జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా స్పందించాలి. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను సోమశిల, కండలేరులకు తరలించేందుకు ఇదే మంచి అవకాశం. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే గతేడాది మాదిరిగా కాకుండా ఈ ఏడాది పూర్తి ఆయకట్టు సాగు చేయవచ్చు.

నెల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సోమశిల పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.62 టీఎంసీలు నీరు ఉంది. అలానే కండలేరు సామర్థ్యం 68 టీఎంసీలు కాగా 6.21 టీఎంసీల నీరు ఉంది. వీటితోపాటు చెరువులు కూడా దాదాపుగా నిండుకున్నాయి. మరో రెండు నెలల్లో కీలక రబీ సీజన్ ప్రారంభం కానుంది. అయితే దుక్కులు దున్నుకునేందుకు కూడా ప్రాజెక్టుల్లో నీరు లేదు. సాధారణంగా జిల్లాలో అక్టోబరు, నవంబరు నెలల్లో వర్షాలు కురుస్తాయి. కానీ గతేడాది తలెత్తిన వర్షాభావం ఈ ఏడాది కూడా పునరావృతమైతే భూములన్నీ బీడుగా మారుతాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది సోమశిలకు వరద రాకపోతే సాగు ప్రశ్నార్థకమవుతుందని రైతాంగం భయపడుతోంది. అయితే శ్రీశైలం డ్యాంకు భారీగా వరద వస్తుండటం రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి 126 టీఎంసీలకు నిల్వ చేరుకుంది. ఇన్‌ఫ్లో 2.58 లక్షల క్యూసెక్కులు కొనసాగుతోంది. అంటే రోజుకు 23 టీఎంసీల వరకు శ్రీశైలంలో చేరుతోంది. ప్రస్తుత నీటిమట్టం 866 అడుగులు దాటింది. అయితే 854 అడుగులు మట్టం దాటితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీరు విడుదల చేసేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో శ్రీశైలం నుంచి సోమశిలకు నీటిని తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడింది.

● ప్రజాప్రతినిధులు స్పందించాలి

పట్టిసీమ నుంచి గోదావరి జలాలను ఇప్పటికే కృష్ణా డెల్టాకు తరలిస్తున్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా డెల్టా వాటా నీటిని సోమశిలకు మళ్లించగలిగితే జిల్లా రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇందుకు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా పని చేయాల్సి ఉంటుంది. జిల్లా పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించి శ్రీశైలం నుంచి నీటిని తీసుకురావాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది. 2018లో కూడా ప్రస్తుత పరిస్థితులే నెలకొన్నాయి. నాడు 48 టీఎంసీలను శ్రీశైలం నుంచి సోమశిలకు తీసుకురావడంతో ఆ ఏడాది పూర్తి ఆయకట్టులో సాగు సాధ్యపడింది. అదే మాదిరిగా ఇప్పుడు కూడా కృష్ణా జలాలను తీసుకొచ్చి జిల్లాను ఆదుకోవాలని ఎమ్మెల్యేలను రైతులు కోరుతున్నారు.

ఆగస్టులో నైపుణ్య సర్వే

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరిశీలన
- సర్వేకు శ్రీకారం చుట్టనున్న డీఆర్‌డీఏ

నెల్లూరు (హరనాథపురం), జూలై 27 : నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో జిల్లావ్యాప్తంగా స్కిల్ (నైపుణ్య) సర్వే జరగనుంది. ఈ నెల 29న కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో సర్వే ఎప్పుడు చేపడతారో తేదీని ప్రకటించనున్నారు. తొలుత జిల్లాలో భారీ పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి. మధ్య, చిన్నతరహా, ఎంఎస్ఎంఈ పరిశ్రములు ఎన్ని? వాటిలో ఏ ఏ స్థాయి ఉద్యోగులు అవసరం తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తారు. మలి విడతలో ఆయా ఉద్యోగాలకు సంబంధించి ఆయా కంపెనీలతోపాటు యువతకు శిక్షణ ఇప్పించడానికి మౌలిక వసతులపై సర్వే చేస్తారు. సర్వే పూర్తయిన తరువాత శిక్షణ వారికి ఆయా పరిశ్రమలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. సర్వేలో భాగంగా జిల్లాలో ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు. వారి విద్యార్హత.. తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు. కాగా, జిల్లాలో డీఆర్‌డీఏ-జాబ్స్ విభాగం ద్వారా కంప్యూటర్ కోర్సులు, హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం మేనేజ్‌మెంటు, రిటైల్ రంగం, ఆటోమొబైల్, టైలరింగ్ తదితర రంగాలలో సుమారు 15వేల మందికి శిక్షణ ఇప్పించారు. వీరిలో సుమారు 12 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివరెడ్డి మాట్లాడుతూ స్కిల్ సర్వే ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతను గుర్తించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించే వీలు కలుగుతుందని చెప్పుకొచ్చారు.



ఏపీపీఎస్సీ డిపార్టుమెంట్

పరీక్షలు నేటి నుంచి

- ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహణ
- హాజరు కానున్న 1923 మంది అభ్యర్థులు

నెల్లూరు (హరనాథపురం), జూలై 27 : ఏపీపీఎస్సీ డిపార్టుమెంట్ పరీక్షలు ఆదివారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్నాయి. నగరానికి సమీపంలోని పొట్టేపాళెం వద్దనున్న డిజిటల్ జోన్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఆబ్జెక్టివ్, కన్వెన్షనల్ పద్ధతిలో జరిగే పరీక్షలకు 1,923 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

● అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : డీఆర్వో

ఏపీపీఎస్సీ డిపార్టుమెంట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌ఓ లవన్న చెప్పారు. ఈ పరీక్షల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు ఆయన అధికారులతో సమీక్షించారు. ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలకు అనుమతించవద్దని అన్నారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్టుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో ఏపీపీఎస్సీ అధికారులు కృష్ణవేణి, అంజన, చీఫ్ సూపరింటెండెంటు వెంకటేశ్వర్లు, లయజనింగ్ అధికారి గయాజ్ అహ్మద్, విద్యుత్ శాఖ ఈఈ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో

ఫండ్ ప్లీజ్..!

- ఎన్‌హెచ్‌ఎం కింద రూ.25 కోట్లు రావాలి
- రోజులు గడుస్తున్నా మంజూరు చేయని కేంద్రం
- ఆసుపత్రుల నిర్వహణకు అవస్థలు

నెల్లూరు (వైద్యం), జూలై 27 : ఏటా విడుదలయ్యే జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులు రోజులు గడుస్తున్నా విడుదల కాకపోవడంతో వైద్యాధికారులు కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఈ నిధులు విడుదల అవుతాయి. ఈ నిధులు విడుదలైతే అత్యవసర మందులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్య మిషన్ కింద జిల్లాకు రూ.25 కోట్లు విడుదల చేయాలి. కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఈ పథకం కింద విడుదల చేయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో కేంద్రం తన వాటా విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సకాలంలో విడుదల చేసేది కాదు. అయితే, ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రావటం చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో నిధులు త్వరగా వస్తాయని వైద్యాధికారులు భావించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి 50 రోజులు గడిచినా విడుదల చేయక పోవటంపై విమర్శలు వక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యం లోపించి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఎన్‌హెచ్‌ఎం కింద విడుదలయ్యే నిధులలో పంచాయతీలకు రూ.20వేలు చొప్పున కేటాయిస్తారు. ఇప్పుడు ఆ నిధులు రాకపోవటంతో పంచాయతీలలో పారిశుధ్యం మెరుగు పనులకు ఆటంకం ఏర్పడుతోంది.



● ఆసుపత్రులకు నిధుల కేటాయింపు

జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లు ఉండగా, ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు చొప్పున కేటాయిస్తారు. మే నెల నాటికి ఈ నిధులు కేటాయించాల్సి ఉంది. రెండు నెలలు గడుస్తున్నా నిధులు కోసం అధికారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అలాగే 24 గంటల ఆసుపత్రులు జిల్లావ్యాప్తంగా ఉండగా ఒక్కో ఆసుపత్రికి రూ.1.75 లక్షలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షల వరకు ఇవ్వాలి. కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులకు రూ.5 లక్షలు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి రూ. 10 లక్షలు చొప్పున విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు ఎప్పుడు విడుదలవుతాయోనని వైద్యాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● జీతాలు, ఖర్చులకూ ఇబ్బందులే

ప్రభుత్వ ఆసుపత్రులలో వందల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. వీరి జీతభత్యాలు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే నిధులు విడుదల చేయకపోవటంతో వారి జీతభత్యాల పరిస్థితి కూడా ఆగమ్య గోచరంగా మారింది. అలాగే, వైద్యాధికారులు వాహన అలవెన్స్ ఇతర ఖర్చులకు కూడా ఎన్‌హెచ్‌ఎం నిధులే ఇవ్వాలి. పీహెచ్‌సీలకు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా, జిల్లా ఆసుపత్రులకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రాకపోవటంతో వైద్యసేవలు కుంటుపడుతున్నాయి. దీనిపై డీఎంహెచ్‌వో పెంచలయ్య మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల కాకపోవడం వాస్తవమేనని అన్నారు. నిధులు వచ్చాక వెంటనే ఆసుపత్రులు కేటాయిస్తామని చెప్పారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చిట్టమూరు, జూలై 27: అడ్డూ అదుపూ లేని విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నామని చెంచు లక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు శని వారం ఆందోళన చేపట్టారు. బోగోలు, సీఎల్ పురం, నాగులవరం, చెన్నారెడ్డిపాలెం, తాళ్ళూరు ఏటీ కండ్రిక ప్రాంత రైతులు పెద్దసంఖ్యలో సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. విద్యుత్ ఏఈపై మండిపడ్డారు. ఈ విషయమై మండల విద్యుత్ శాఖ అధికారి నాగూర్‌వలి మాట్లాడుతూ గత మూడు రోజులుగా వీస్తున్న గాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారన్నారు. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరా చేస్తాం అన్నారు. దీంతో రైతులు శాంతించి వెనుతిరిగారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూలై 27: స్పష్టమైన కారణాలు తెలియవు కానీ గుర్తుతెలియని వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని కరెంట్ ఆఫీసు రైల్వేగేటు సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలుపట్టాలపై శనివారం సాయంత్రం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. మృతుడు వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్లలోపు ఉంటుందని, మృతుడు గ్రీన్ రంగు ఆఫ్ హ్యాండ్స్ టీషర్ట్, బులుగు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని నెల్లూరు రైల్వే ఎస్ఐ జి.మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు నమోదు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

- రూ 2.47 లక్షల రికవరీకి ఆదేశం


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 27 : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధిహామి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 2022-23 సంవత్సరంలో రూ.10.7 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించి అవకతవకలపై చర్చించారు. ఈ సామాజిక తనిఖీలో రూ 2,47,908 లను రికవరి చేయాల్సిందిగా సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి రూ. 1,01,801, పంచాయతీరాజ్ పరిధిలోని పనులకు రూ. 1,46,102లు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బీ. శ్రీనివాసులు, ప్రొసీడింగ్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో బాలాజీనాయక్, డీవీవో జీ. శ్రీనివాసులు, క్వాలిటీ కంట్రోల్ డీఈ వేణుగోపాల్, ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ ఎం. శంకరనారాయణరావు, ఎస్ఆర్‌పీ ఎం నాగార్జున, ఏపీవో ఎం. శిరీష, ఈసీ జానకి, టీడీపీ నాయకులు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఏఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఉదయగిరిలో యువకుడికి డెంగ్యూ


నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామారావు

ఉదయగిరి రూరల్, జూలై 27: పట్టణంలోని కావలి మార్గంలో ఉన్న పూసల కాలనీలో చప్పలి రామారావు అనే యువకుడికి డెంగ్యూ జ్వరం సోకి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వివరాల మేరకు.. పది రోజుల క్రితం రామారావుకు జ్వరం సోకడంతో కుటుంబ సభ్యులు ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు రామారావుకు పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. వారి ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే కావడంతో రామారావును మరలా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

మట్టి తిని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


హైదార్‌అలీ మృతదేహం

ఏఎస్‌పేట, జూలై 27: మతిస్థిమితం లేని ఈ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం బేల్గం జిల్లా ఘటప్రభా గ్రామానికి చెందిన దాదాహన్నా కుమారుడు హైదార్ అలీ (33)కి మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 20న ఏఎస్‌పేట దర్గాకు తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి హైదార్‌అలీ కనపడలేదు. దీంతో గ్రామం మొత్తం వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అనుమసముద్రం చెరువు దగ్గర పశువులకాపరులకు కనపడిన అతను శనివారం ఉదయం మృతి చెంది కనిపించాడు. దీనిని గమనించిన పశువులకాపరులు పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ విక్రమం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండు రోజులుగా చెరువు వద్ద తిరుగుతూ మట్టితినడం వల్ల మృతి చెందినట్లు పలువురు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కావలి రూరల్, జూలై 27: కావలి పట్టణం ముసునూరు ట్రంక్ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లా ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వెంగళరావునగర్ రోటరీ క్లబ్ ప్రాంతానికి చెందిన ప్రశాంత్, మరో వ్యక్తితో కలసి మోటారుసైకిల్‌పై ముసునూరు వైపు నుండి కావలి బయలుదేరారు. మార్గ మధ్యంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రోడ్డు పక్కన ప్రయాణికులనుదించేందుకు ఆర్టీసీ బస్ ఆగడంతో వెనుకనే మోటారు సైకిల్‌పై వచ్చిన యువకులు బస్‌ను అధిగమించబోయారు. ఆ సమయంలో కావలి వైపు నుండి లారీ రావడంతో బస్, లారీల మధ్య వస్తున్న బైక్‌కు లారీ వెనుక వైపున కమ్మి తగలటంతో బైక్ అదుపుతప్పి కిందపడి పోయింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రశాంత్‌కు తీవ్రగాయాలు కాగా, వెనుక ఉన్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ప్రశాంత్‌ను పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ డిఎం రాపూరి శ్రీనివాసులు, రూరల్ సిఐ శ్రీనివాసరావు పరిశీలించారు. పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ మోటారు బైకు ఎవరిదో..

వరికుంటపాడు, జూలై 27: మండలంలోని నార్తకృష్ణంరాజుపల్లిలో నాలుగు రోజులుగా ఓ మోటారు బైకు ఇక్కడ ఎందుకు ఉందో, ఎవరిదో అనే సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏపీ 27 బీటీ 1436 నంబరు గల బైకు యజమాని ఆచూకీ కోసం ప్రజలు ఆరా తీస్తున్నారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో చోరీలు జరగడంతో వాటికి పాల్పడిన దొంగలే ఉద్దేశపూర్వకంగానే వదిలేసి వెళ్లారా లేక మరమ్మతులకు గురైతే ఇక్కడ ఉంచారా అన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



అనుమానాస్పదంగా ఉన్న మోటారు బైకు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6529
వెండి కిలో ధర	రూ. 84,100
వెండి ఒక గ్రాము	రూ. 86.10

'నాడు-నేడు' పనుల్లో నాణ్యత ఎంత!?

- విద్యార్థి మృతి ఘటనతో విద్యా శాఖ ఆరా
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఈవో సమీక్ష
- ప్రత్యేక కమిటీతో విచారణ


నెల్లూరులోని కేఎస్‌ఆర్ పాఠశాలలో అర్ధంతరంగా ఆగిపోయిన 'నాడు-నేడు' పనులు

నెల్లూరు (విద్య), జూలై 27 : గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు ప్రారంభం నుంచీ నత్తనడకన సా...గుతూనే ఉన్నాయి. ఇప్పటికీ 50 శాతానికిపైగా పనులు పూర్తి కాకపోగా, భవనాలన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయి ఉన్నాయి. పూర్తి అయ్యాయని చెపుతున్న పాఠశాల భవనాలు కూడా అత్యధిక ప్రాంతాల్లో వినియోగించడం లేదు. పైగా అసలు ఇవి పక్కాగా ఉన్నాయా లేదా అన్నదికూడా సందిగ్ధంగా మారింది. ఈ నిర్మాణాల్లో సంబంధిత యంత్రాంగంతో పాటు పేరెంట్స్ కమిటీలు, హెచ్‌ఎంలు, స్థానిక రాజకీయ నేతల హస్తం ఉండడంతో వీటిలో ఎంత మేర పనులు జరిగాయి, వాటిలో అవినీతి ఎంత ఉందో తెలుసుకునే దిశగా అధికారులు ప్రత్యేక కమిటీని నియమించారు. నగరంలోని కేఎస్‌ఆర్ ప్రాథమిక పాఠశాలలో గోడ కూలి గురుమహేంద్ర అనే విద్యార్థి మృతి చెందడంతో నాడు-నేడు పనుల డొల్లతనం బట్టబయలైంది. దీనిపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో అధికారులు విచారణను వేగవంతం చేశారు.

విద్యార్థి మృతిపై ప్రత్యేక కమిటీ

కేఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థి మృతి చెందిన ఘటనపై విద్యా శాఖ ప్రత్యేక కమిటీని నియమించింది. నెల్లూరు డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, డైట్ లెక్చరర్ వెంకటేశ్వర్లుతో పాటు మరొకరితో కలిపి త్రీమెన్ కమిటీ విచారణ చేపడుతోంది. పాఠశాల భవన నిర్మాణాలు ఎలా జరిగాయి, ఎంత నాణ్యతా ప్రమాణాలు పాటించారు, అసలు నిర్మాణాలు ఎందుకు ఆగిపోయాయన్న కోణంలో విచారణ జరుగుతోంది. అలాగే ప్రాథమిక పాఠశాలలో హైస్కూల్ విద్యార్థులకు తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారు.. నిర్వహించినా ఆగిపోయిన భవనాల వద్ద రక్షణ చర్యలు ఎందుకు చేపట్టలేదన్న అంశాలతో పాటు పేరెంట్స్ కమిటీ బాధ్యతలు, హెచ్‌ఎం పర్యవేక్షణ అంశాలను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. ఇందులో భాగంగా శనివారం డీఈఓ రామారావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లావ్యాప్తంగా నాడు-నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎన్ని భవనాలు పూర్తయ్యాయి, పూర్తి కాని భవనాల వద్ద, అసంపూర్తిగా నిలిచిపోయిన కట్టడాల వద్ద ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అసంపూర్తి భవనాలు ఉన్న ప్రాంతాలన్నీ రెడ్‌జోన్‌గా ప్రకటించి విద్యార్థులు అటువైపు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని విషయాలపై కూడా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలను ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు అందచేసి చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

నాడు-నేడుపై ఆడిటింగ్ నిర్వహించాలి

నాడు-నేడు కింద చేపట్టిన పనులపై ఆడిటింగ్ నిర్వహించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పనుల నాణ్యత, ఇతరత్రా లోపాలపై ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో ఆడిటింగ్ ద్వారా లోటుపాట్లు, అసంపూర్తి పనులను గుర్తించాలని కోరుతున్నారు. పనులు జరిగిన పలుచోట్ల కనీస ప్రమాణాలు పాటించలేదని, ప్రధానంగా తాగునీటి శుద్ధి యూనిట్లు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతుల్లో లోపాలున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. పాఠశాల కమిటీలు కాకుండా ఇతరులు ఈ పనులు చేయడం, రాజకీయ పరమైన జోక్యం ఉండటంతో ప్రధానోపాధ్యాయులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో నాణ్యత లోపాలు తలెత్తినట్లు వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. కేజీబీవీల్లో సైతం కనీస ప్రమాణాలు పాటించలేదని, నాసిరకం పనులు చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించి పలు ఫిర్యాదులు రావడంతో వెంటనే తనిఖీలు చేపట్టడంతో పాటు ఆడిటింగ్‌తో వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఘనంగా గంధమహోత్సవం

అనంతసాగరం, జూలై 27: స్థానిక శ్రీ హజరత్ కరీముల్లాషాఖాదరీ దర్గా 131 వ గంధమహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుదీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దర్గాలో ఫాతెహా, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని యూనియన్ రోడ్డులో వెలసి ఉన్న శ్రీషాషావలిసాహెబ్ వారి 45వ గంధమహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా గంధాన్ని దర్గాకు చేర్చారు. దర్గాలో చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

ఈదురు గాలుల బీభత్సం

వరికుంటపాడు, జూలై 27: రెండు రోజులుగా మండలంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో ఉక్కపోతను తట్టుకోలేక ఆరుబయట నిద్రించే వారి పరిస్థితి దారుణంగా తయారైంది. శుక్రవారం అర్ధరాత్రి గాలుల ప్రభావం అధికమవడంతో తూర్పుబోయమడగల ఎస్సీ కాలనీలోని వీధిలో ఓ టేకు చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. దాంతో తీగలు తెగి రహదారిపై పడాయి. ఆ సమయంలో జనసంచారం లేకపోవడం తో ప్రమాదం తప్పిందని కాలనీవాసులు ఊపిరి పీల్చుకు న్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు.


విద్యుత్ తీగలపై కూలిన చెట్టు

ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా ఉండాలి

- ఏపీసీబీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి




మాట్లాడుతున్న వెంకట సుబ్బారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 27 : కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం డీసీసీబీ సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లా సహకార బ్యాంకు ఉద్యోగుల యూనియన్ సర్వసభ్య సమావేశం జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సుష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ బదిలీల పారదర్శకంగా జరగడానికి యాజమాన్యం సహకరించాలన్నారు. వేజ్ రివిజన్ అన్ని క్యాడర్ ఉద్యోగులకు జరగాలన్నారు. తమ యూనియన్ రాష్ట్ర మహాసభను త్వరలో జరుపుతామని చెప్పారు. కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యల సాధనకు నిరంతర పోరాటం చేస్తామన్నారు. జిల్లాలో కుమార్‌పాల్ ఏపీసీబీఈఏ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల ఏర్పడిన అసోషియేషన్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణా జిల్లా డీసీసీబీకి చెందిన సనక గోపినాథ్‌ను కోఆప్షన్ ద్వారా ఎన్నుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీసీబీఈఏ ముఖ్య సలహాదారు భోగాది శ్రామ్ ప్రసాద్, నెల్లూరు డీసీసీబీ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ప్రతినిధులు ఎన్‌వీపీ శ్రీనివాసరావు, ఆర్‌వీ కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, కె.కుమార్‌పాల్, మురళీమోహన్‌రావు, మూసా షరీఫ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ చేయాలి

- ఏపీ విద్యార్థి జేఏసీ నేతల డిమాండ్


విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

నెల్లూరు (విద్య) : కేఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థి గురుమహేంద్ర మృతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఏపీ విద్యార్థి జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని డీఈవో కార్యాలయంలో ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి మాట్లాడుతూ 1600 మంది విద్యార్థులున్న పాఠశాలలో కనీస రక్షణ లేకుండా సంబంధిత ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం కూడా విద్యార్థి మృతికి కారణమేనన్నారు. నాడు-నేడు పనుల్లో భాగంగా నూతన భవన నిర్మాణం ఏడాదికి పైగా నిలిచిపోయిందని, అది కూడా నాసిరకంగానే నిర్మాణాలు చేపట్టారన్న విషయం తేటతెల్లమయ్యిందన్నారు. అత్యధికంగా ఇసుకతోనే నిర్మాణాలు చేపట్టిన ఈ భవనాల్లోకి విద్యార్థులను ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి నాడు-నేడు నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మురళీకృష్ణ, బాలు, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ యార్డ్ స్థలం కోసం పరిశీలన

సంగం, జూలై 27: మండల కేంద్రంలో ఇసుక స్టాక్ యార్డ్ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం ఆర్డీవో మధులత శనివారం పరిశీలించారు. సంగం బ్యారేజీకి ఎగువున డిసిల్టేషన్ కేంద్రాన్ని గుర్తించారు. డ్రెజ్జింగ్ విధానంలో ఇసుక తీసి స్టాక్ యార్డ్‌కు తరలిస్తారు. ఆర్డీవో మధులత స్టాక్ యార్డ్ కోసం స్థానిక ఇన్‌చార్జి తహసీల్దారు, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వోలతో కలిసి రెవెన్యూ స్థలాన్ని పరిశీలించారు. కాని ఆ స్థలం లోతట్టులో ఉండడం, ముంబాయి జాతీయ రహదారికి దగ్గరగా ఉండడంతో అక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఆమె సందేహం వ్యక్తం చేశారు. మరెక్కడైనా ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందేమో పరిశీలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.


ఇసుక స్టాక్ యార్డ్‌కు అనువైన స్థలం పరిశీలిస్తున్న అధికారులు

కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటాలి

- సెట్నెల్ సీ-ఈవో వెంకటయ్య


మొక్క నాటుతున్న అధికారులు, నేతలు

నెల్లూరు(వైద్యం), జూలై 27 : ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యాన్ని నివారించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలని సెట్నెల్ సీఈవో వెంకటయ్య వెల్లడించారు. శనివారం వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డే సందర్భంగా బుజబుజ నెల్లూరు పీఎంపీ కార్యాలయం నుంచి వడ్లూరు కాలనీ ఎంపీపీ స్కూలు వరకు మొక్కలు నాటండి.. ప్రకృతిని కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని కాస్మటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ డోలా సుస్మిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ యువత మొక్కలు నాటాలని, బిడ్డ పుట్టిన వెంటనే ఓ మొక్క ను నాటే విధానాన్ని అమలు చేయాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ విద్యా లయాలు, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయంలోనూ మొక్క లు పెంచాలని సూచించారు. అనంతరం ఎంపీపీ స్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవా ధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కోశాధికారి శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, షేక్ మహబూబ్ బాషా, రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, హెచ్‌ఎం మాధవి, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలు నెల్లూరుకు తరలించండి

- ఇరిగేషన్ శాఖ మంత్రికి ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ

నెల్లూరురూరల్, జూలై 27 : పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం జలాశయంలోని కృష్ణా జలాలను నెల్లూరు జిల్లా సోమశిల, కండలేరు జలాశయాలకు తరలించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు శనివారం లేఖ రాశారు. ఈ మేరకు జిల్లాలోని జలాశయాల దుస్థితిని వివరించిన ఆయన ప్రస్తుతం సోమశిలలో 9.6, కండలేరులో 6.19 టీఎంసీల నిరు మాత్రమే నిల్వ ఉందని పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయంలో 3.40 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోతో 865 అడుగుల మట్టానికి నీటి నిల్వ చేరిందని తెలిపారు. కృష్ణా జలాలను నెల్లూరుకు తరలించడం వల్ల ప్రకాశం, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడు ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుతాయని వెల్లడించారు. తన విజ్ఞప్తిని ఆచరణలోకి తీసుకుని జలాల తరలింపునకు సహకరించాలని కోరారు.

చిట్టెలుక కరిచి ఒకరి మృతి

నెల్లూరురూరల్, జూలై 27 : చిట్టెలుక (చుంచు ఎలుక) కరచి ఓ వ్యక్తి మరణించిన ఘటన శనివారం జరిగింది. నెల్లూరురూరల్ పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని ములుముడికి చెందిన మణికాల రాగయ్య (55) తన ఇంట్లో మంచంపై పడుకుని నిద్రిస్తుండగా చుంచు ఎలుక ఎడమ కాలు పాదం, కుడి అరచెయ్యిను కొరికింది. పని వెళ్లిన ఇంటికి వచ్చిన అతని భార్య బంగారమ్మ భర్తకు గాయాలు ఉండడం గమనించి అతనని సమీప గ్రామం సౌత్‌మోపూరు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన డాక్టర్లు 108 వాహనం సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ మేరకు బంగారమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మారుతీకృష్ణ తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

కావలిటౌన్, జూలై 27: మిసైల్ మ్యాన్ కలాం ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో పలువురు కలాంకు నివాళు లర్పించారు. జెండాచెట్టు వద్ద ట్రంకురోడులోని కలాం విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పాల్గొని కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, అర్షియాబేగం, రహీం, రఫీ, హజరత్ పాల్గొన్నారు.



కావలిటౌన్: అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో

మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి డీబీఎస్ కార్యదర్శి దామిశెట్టి సురేష్‌బాబు, సుదీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో

పెన్షనర్స్ భవన్‌లో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సాయిరాంసింగ్, వరప్రసాద్, జమున తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: నేటి యువతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని మండల సీఐటీయు కార్యదర్శి చల్లా నరహరి, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుదీన్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి, రిజర్వేషన్ కౌంటర్ కోసం అందరు కలసి శాంతియుతంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, టీడీపీ నాయకులు పసుపులేటి చెంచయ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎత్తిరాజు, అహ్మద్‌బాషా, మానవ హక్కుల పోరాట సమితీ జిల్లా అధ్యక్షులు దాసరి సునీల్, మాజీ సైనికుడు విజయప్రతాప్‌రెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కలువాయి, జూలై 27 : పంచాయతీలోని మజరా గ్రామం సీతారాంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ తనిఖీ చేశారు. రాపూరు సీడీపీవో సునంద ఆదేశాల మేరకు కేంద్రాన్ని తనిఖీ చేసినట్లుగా ఆమె తెలిపారు.

ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకా వేయించాలి

కందుకూరు, జూలై 27: ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఓఆర్ ఉమామహేశ్వరి వైద్యసిబ్బందిని ఆదేశించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రతి బిడ్డకు టీకా వేయాలన్నారు. అంతకుముందు క్లబ్‌రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టరు బ్యూలాగ్రేస్, హెచ్‌ఈఓ అశోక్, పీహెచ్‌ఎన్ఐ పద్మావతి పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: గర్భిణులు, పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం ఆరోగ్య ఉప కేంద్రంను డాక్టర్ ఉమామహేశ్వరి శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శివరామయ్య, హెచ్‌ఈఓ ప్రసాద్‌రావు, సూపర్‌వైజర్లు బాలరాజు, పద్మావతి, ఏఎన్ఎమ్ లావణ్య, ఎంఎల్‌హెచ్‌పి అనూష, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ ఉమామహేశ్వరి

గ్రామదేవత అంకమ్మకు ఎమ్మెల్యే ఇంటూరి పూజలు



ఎమ్మెల్యే నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న మహదేవపురం గ్రామస్థులు

కందుకూరు, జూలై 27: మండలంలోని మహదేవపురం గ్రామదేవత అంకమ్మకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు శనివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహదేవపురంలో అంకమ్మ జాతరను పురస్కరించుకుని గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్‌లతో కలిసివెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓరుగంటి రమణయ్య, గుళ్లా శ్రీనివాసరావు, గుళ్లా సుధాకర్, లాల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్ తనిఖీ

కావలిటౌన్, జూలై 27: పట్టణ వెంగళరావు నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌ను శనివారం డిప్యూటీ డీఈఓ రఘురామయ్య తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టీలను తనిఖీ చేశారు. శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. నాడు- నేడు పనులు పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు హయ్యాల్‌హయ్యామ్‌కు తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

కావలి, జూలై 27: కావలి పట్టణ ట్రంకురోడ్డు - మందాటి చెరువు కట్ట మధ్యలో ఉన్న స్థలంలో ఆక్రమణలను శనివారం కావలి మున్సిపల్ అధికారులు తొలగించారు. అక్కడ గతంలో పార్కు నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలివేసిన ప్రాంతంలో కొందరు ఆక్రమణలకు శ్రీకారం చుట్టారు. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని తొలగించి మున్సిపల్ ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు.

వెంగళరావునగర్‌లో వివాదం

కావలి పట్టణ వెంగళరావునగర్‌లో ఉదయగిరి రోడ్డు వెంబడి ఉన్న కాలువలో పూడికతీతకు అధికారులు సిద్ధమై అక్కడకు ఎక్స్‌కవేటర్ తీసుకెళ్లారు. అయితే ఆ డ్రైనేజీపై బంకులు ఏర్పాటుచేసి ఉండటంతో వాటిని తొలగించనిదే పూడికతీత సాధ్యంకాదని చెప్పటంతో బంకులు తొలగించేందుకు సాహసించలేదు. అయితే ఆ బంకుల ముందు రోడుపై వర్షపునీరు వెళ్లే విధంగా ఏటవాలుగా మట్టి తీసి ఆ మట్టిని బంకుల ముందు కట్టగా వేశారు. దీంతో బంకుల యజమానులు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి వద్దకు వెళ్లటంతో మరలా ఆ బంకుల వద్ద తవ్విన మట్టిని చదునుచేసి వెళ్లారు. దీనివలన మున్సిపాల్టీ అనవసర ఖర్చులు భరించాల్సి వచ్చింది.

ఆక్రమణదారులకు నోటీసులు

లింగసముద్రం, జూలై 27: లింగసముద్రం పంచాయతీలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆ శాఖ స్థలాలను ఆక్రమించిన వారికి, అందులో అక్రమంగా కట్టడాలు నిర్మించిన వారికి నోటీసులు అందజేస్తామని పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు శనివారం చెప్పారు. ఈ స్థలాలను ఆక్రమించి చాలామంది దుకాణాలు, హోటళ్లు, ఇంకా పలు కట్టడాలు అక్రమంగా నిర్మించారని ఆయన చెప్పారు. దీంతో రోడ్డు కుంచించుకొని పోయి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి, వారి నుండి వివరణ తీసుకున్న అనంతరం ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

లింగసముద్రం, జూలై 27: మండలంలోని ఎర్రారెడిపాలెంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు లేని వారు, సవరణలు అవసరమైన వారు ఈ కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలు పొందవచ్చన్నారు. వచ్చే సోమవారం నుంచి లింగసముద్రంలోని సచివాలయం -1లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులు చెప్పారు.

● **కలిగిరి :** పుట్టిన శిశువు నుండి ముదుసలి వరకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు కలిగి ఉండాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని క్రాకుటూరు గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఆధార్ నమోదు శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. మండల పరిధిలో ఆధార్‌లేని వారిని గుర్తించి ఈ శిబిరాల్లో ఆధార్ తీయించడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

కావలి, జూలై 27: కావలి పట్టణ పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధే ధ్యేయం



ఎన్‌ఎఫ్ఐఆర్ చీఫ్ శ్రీనివాసులును సన్మానించిన రైల్వే విశ్రాంత ఉద్యోగులు

బిట్రగుంట, జూలై 27: బిట్రగుంట రైల్వే అభివృద్ధితో పాటు స్థానిక రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం అని ఎన్ఎఫ్ఐఆర్ చీఫ్ సెక్రటరీ ఉదయగిరి శ్రీనివాసులు అన్నారు. బిట్రగుంట రైల్వే కార్మికులు, రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఆగస్టు నెలలో ఎన్ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్) అధ్యక్షుడు మర్రి రాఘవయ్య సమావేశం జరుగనున్న సందర్భంగా స్థల ఎంపికకై శనివారం బోగోలు మండలానికి ఆయన విచ్చేశారు. తిప్ప జాతీయ రహదారి వద్ద విశ్రాంత ఉద్యోగులు నూకసాని శ్రీనివాసులు యాదవ్, గణపతి విజయరాజు, ఓఎస్ గోవిందరాజులు ఆయన్ను కలుసుకుని స్వాగతం పలికారు. ప్రస్తుతం రైల్వేబిట్రగుంట దుస్థితిని, తరలిపోయిన కార్యాలయాలు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. రైల్వే తెలుగు మీడియం పాఠశాల ఆవరణతో పాటు రెండు కల్యాణ మండపాల ప్రదేశాలను పరిశీలించారు. మొదట ఇబ్రహీంపేటలోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఐసీఎఫ్ సిబ్బంది, రైల్వే విశ్రాంత ఉద్యోగులు బంకా రాజన్న, పరిమి సీతారామయ్య, సీహెచ్.నరహరి తదితరులు ఉన్నారు.

ప్రజల ఆస్తుల పరిరక్షణకే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు

కావలి, జూలై 27: ప్రజల ఆస్తులను దోచుకోవటానికి గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తీసుకువచ్చిందని, దీంతో సీఎం చంద్రబాబునాయుడు ప్రజల ఆస్థుల పరిరక్షణకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దుచేశారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలో జరుగుతున్న అన్న క్యాంటీన్ భవన మరమ్మతు పనులను, 100 అడుగుల జాతీయ జెండా ఐకానిక్ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ఆస్థులను కాపాడటానికి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దుచేయటం జరిగిందని. ఇకపై అందరూ నిశ్చింతగా ఉండవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా అన్న క్యాంటీన్‌లు మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. మరలా వాటిని ఆగస్టు 15న తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావలిలో అన్న క్యాంటీన్‌కు ఎదురుగా సొంత నిధులతో కావలికి ఐకానిక్‌గా 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కావలి ఖ్యాతి నలుదిశలా వ్యాప్తిచెందే విధంగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిని కూడా ఆగష్టు 15న ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్,టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కందుకూరు, జూలై 27: నెల్లూరు నగరంలోని కేవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గురుమహేంద్ర గోడకూలి మృతిచెందటానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పనులను అత్యంత నాసిరకంగా చేయటం వల్లే గోడకూలి విద్యార్థి మృతిచెందినందున దీనిని ప్రభుత్వ హత్యగానే పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. నాసిరకం పనులు చేసిన నిర్వాహకులు, పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈఓలను బాధ్యులను చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. నాడు - నేడు పనులపై ప్రభుత్వం విచారణ జరిపించాలని, మృతిచెందిన విద్యార్థి గురుమహేంద్ర కుటుంబానికి 25 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి:ఎంవీఐ



మాట్లాడుతున్న ఎంవీఐ ఎస్కేఎండీ రఫీ

కందుకూరు, జూలై 27: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు విధిగా పాటించటం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవీఐ ఎస్కేఎండీ రఫీ కోరారు. పట్టణంలోని శ్రీవివేకా డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపరవాణా కమిషనర్ బి చందర్ ఆదేశాలతో శనివారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను ఎలా రక్షించాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ ఎస్ మల్లిఖార్జునరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో నాయీబ్రాహ్మణుల కమిటీ ఏర్పాటు

వలేటివారిపాలెం, జూలై 27: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఎన్నో ఏళ్ల నుండి స్వామికి సేవలు అందిస్తున్న నాయీబ్రాహ్మణులు శనివారం కమిటీని ఏర్పాటుచేసుకున్నారు. కమిటీలో గౌరవ అధ్యక్షులుగా చుండి అక్కయ్య, చింతలపూడి శ్రీనివాసులు, ప్రెసిడెంట్‌గా మాచవరపు వెంకటరత్నం, వైస్ ప్రెసిడెంట్‌గా చుండి హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా పాలేటిపాటి మునిస్వామి, కార్యదర్శిగా కొనిజేటి ఏడుకొండలు, ట్రెజరర్‌గా రావులకొల్లు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి



శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ సుబ్బారెడ్డి

కందుకూరు, జూలై 27: బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవటంతో పాటు నిరంతర పరిశీలన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని, బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించటానికే టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు ఎంఈఓ కె సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సపోర్టింగ్ ఆంధ్ర స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్ఎల్డీ) ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా రాష్ట్ర విద్య పరిశోధనా మండలి, సమగ్ర శిక్ష సంయుక్తంగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీలకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 9 రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారందరికీ ఎంఈఓ సుబ్బారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎం నరసింహమూర్తి, శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనీలు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఉపాధి సొమ్ము రూ.76 లక్షల రికవరీ

కలువాయి, జూలై 27 : మండలంలో ఉపాధిహామీ పథకంకు సంబంధించిన రూ.76లక్షల నిధులు రికవరీకి రాసినట్లు తెలిసింది. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన రూ.11కోట్ల పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 20 పంచాయతీలో రూ.2.89కోట్లు అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించి అధికారులకు తెలియజేశారు. దీనిపై విచారించిన అధికారులు సుమారు రూ.76లక్షలు బాధ్యుల నుంచి రికవరీకి రాసినట్లు సమాచారం. అయితే నిధులు రికవరీకి సంబంధించిన వివరాలు తమకు అధికారికంగా ఇవ్వలేదని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. కనీసం మండల పరిషత్తు అధికారులకు కూడా సమాచారం ఇవ్వకపోడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పెంచలస్వామి ఆరాధన మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు, జూలై 27: మండలంలోని దేపూరు గ్రామ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద శనివారం హనుమాన్‌భక్త శ్రీ పెంచలస్వామి 34వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెంచలస్వామికి, సాయిబాబా, అంజనేయస్వామి, వెంకయ్యస్వామి, రామలక్ష్మణులకు పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలలో నిర్వాహకులు భాస్కర్ నాయుడు, పెంచలనాయుడు, గ్రామ సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, దొడ్ల సుమన్, కొల్లా ఆదిశేషయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొల్లి ఆదిశేషయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

దాడిపై విచారణ

అనంతసాగరం, జూలై 27: మండలంలోని ముస్తాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న లిటిల్ ఎంజెల్స్ పాఠశాలలో చదివే విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డిపై కరస్పాండెంట్ మల్లికార్జున దాడి చేసిన ఘటనపై మండల విద్యాశాఖాధికారులు జానకీరాం, ప్రభాకర్‌రెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఉప్పలపాడు, కమ్మవారిపల్లి గ్రామాలకు వెళ్లి కరస్పాండెంట్ ప్రవర్తనపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామని వారు తెలిపారు.

పాఠశాల వద్ద ఏబీవీపీ ఆందోళన

విద్యార్థిని తండ్రిపై కరస్పాండెంట్ దాడి చేసిన ఘటనపై ఏబీవీపీ నాయకులు స్పందించారు. పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళన విరమించే ప్రయత్నం చేశారు. జిల్లా కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థిని తండ్రి తన కుమార్తె గణితంలో వెనుకంజలో ఉందని చెప్పినందుకు అమానుషంగా దాడి చేయడంపై ఎంఈవోలను ప్రశ్నించారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆత్మకూరు, జూలై 27 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తెరిగి మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సి ఉందని ఉప విద్యాశాఖాధికారి కే. గోపాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో 70 మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ విచక్షణా రహితంగా చెట్లు నరకడంతో ఆక్సిజన్ కొరత ఏర్పడి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థి ఔధార్యం స్ఫూర్తిదాయకం

కందుకూరు, జూలై 27: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తిచేసి కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని ఔధార్యం స్ఫూర్తిదాయకం అని కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బసిరెడ్డిపాలెంకు చెందిన కుడుముల అఖిల కళాశాలలో ఎంపీసీ విభాగంలో 966 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని, శనివారం అఖిల తండ్రి రమేష్‌రెడ్డి 10వేల రూపాయలు తమకు అందజేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగించాలని కోరారని తెలిపారు. విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో చేరి వేలకువేలు వృథా చేసుకోకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆయన కోరారు.

ముప్వా కొండయ్యకు పరామర్శ



ముప్వా కొండయ్యను పరామర్శిస్తున్న సీపీఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య

కందుకూరు, జూలై 27: సీపీఎం సీనియర్ నాయకుడు, ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టరు ముప్వా కొండయ్యను సీపీఐ జాతీయ నాయకులు, ఆల్‌ఇండియా కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య శనివారం పరామర్శించారు. వృద్ధాప్య రీత్యా అనారోగ్యంతో కొంతకాలంగా ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్న ముప్వా కొండయ్యను వెంకయ్య పరామర్శించి యోగక్షేమాలు విచారించారు. ఆయన వెంట స్థానిక సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, హరిబాబు తదితరులున్నారు.

మాదాల మృతి తీరని లోటు

వరికుంటపాడు, జూలై 27: నియోజకవర్గ టీడీపీ నాయకులు, నర్రవాడ ఎంపీటీసీ మాదాల రామచంద్ర మృతి టీడీపీకు ఎంతో తీరని లోటని యూడీఎఫ్ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు వీ రామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడిగా, రైతుసేవా అధ్యక్షునిగా సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారని పలువురు కొనియాడారు. ఆయన మృతిపై తమ శాఖ తరుపున ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

సంగం, జూలై 27: స్థానిక తూర్పువీధిలో వెలసి ఉన్న అభయ గంగమ్మ ఆలయంలో ఆదివారం నుంచి జాతర మహోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం మైలు తుడుపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత పుట్టబంగారం పూజ, పూలంగి సేవ, అన్నదానం, సోమవారం గ్రామోత్సవం, మంగళవారం కలిశాల ఉత్సవాలు, గ్రామ పొంగళ్లతో ఉత్సవాలు ముగుస్తాయి.

అధినేతల చిత్రపటాల బహూకరణ



సీఎం,డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

సీతారామపురం, జులై 27 : టీడీపీ మండల సీనియర్ నాయకులు ముత్తంశెట్టి చెన్నకేశవులు, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు అప్పని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బండ్ల హరికృష్ణల ఆధ్వర్యంలో మండల పరిధిలోని బసినేనిపల్లి సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్ర పటాలను బహూకరించారు. కార్యక్రమంలో పడమటి రొంపిదొడ్ల కమిటీ చైర్మన్ అప్పని బాల వెంకటసుబ్బయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడిపాటి విజయకుమార్, బద్వేలి రమణారెడ్డి, అంబవరపు రమణారెడ్డి, మిలిటరీ రమణరెడ్డి, ఏసీ నగర్ గోవిందు, నాగయ్య, ఖాజావలి, అప్పని అశోక్, పీఆర్ ఏఈ బాలినేని ప్రవీణ్ కుమార్, సచివాలయ సిబ్బంది కార్యదర్శి రాజేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

కావలి రూరల్, జూలై 27: పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్పీడీవో శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను శనివారం ఎమ్పీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగు నీరు నిల్వలేకుండా వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



నాగమణి

అల్లూరు, జూలై 27: తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గోగులపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకమ్మలు రాయికోత పనిచేస్తూ హైదరాబాద్ సమీపంలో ఉంటున్నారు. ఈక్రమంలో 10సంవత్సరాలు వయస్సు కలిగిన నాగమణి తన తల్లిదండ్రుల వద్దనుండి వేరేప్రాంతంలోని బంధువుల వద్దకు వెళుతూ తప్పిపోయి సమీపంలోని శంషాబాద్‌లో సంచరిస్తుండగా ఎయిర్‌పోర్ట్ పోలీసులు బాలికను విచారించి అల్లూరు పోలీసులకు సమాచారమందించారు. దీంతో ఎస్ఐ తల్లిదండ్రులకు సమాచారమివ్వగా వారు తమ బంధువులను బాలిక వద్దకు పంపారు. శంషాబాద్ పోలీసులు బాలికను వారి బంధువులకు అప్పజెప్పారు. ఈమేరకు తమకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

నగర పంచాయతీ గుంటభూమి ఆక్రమణ

అల్లూరు, జూలై 27: అల్లూరు నగర పంచాయతీకి చెందిన చేపల గుంటను కొంతమంది స్థానికులు ఆక్రమించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గుంటను గతంలో పలువురు చదునుచేసి కొంతమేర ఆక్రమించారు. మరలా అదేవిధంగా మరికొందరు ఆ గుంత భూమిలో చెట్లు, పుట్టలు తొలగించి మట్టి తోలి చదును చేశారు. సమాచారం అందుకున్న నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మోటారు స్టార్టర్ విషయంలో గొడవ

ఏఎస్‌పేట, జూలై 27: పొలంలోని మోటర్ స్టార్టర్ విషయంలో గొడవపడి దాడి చేసుకున్న ఘటన ఏఎస్‌పేట మండలం అబ్బాసాహెబ్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు గ్రామానికి చెందిన నందా లక్ష్మయ్య, అతని అన్న నందా రవికు ఒకేచోట పొలం ఉండడంతో వారిద్దరూ ఉమ్మడిగా బోరును వేసుకుని పొలానికి వాడుకుంటున్నారు. అన్న మృతి చెందడంతో వదిన అనురాధ పొలాన్ని గ్రామానికి చెందిన పొలిశెట్టి మాల్యాద్రికి కౌలుకి ఇచ్చింది. అతను కౌలుకు తీసుకున్న పొలంతో పాటు పక్కనే ఉన్న తన సొంత పొలానికి కూడా ఈ బోరు వాడుకుంటున్నాడు. దీంతో లక్ష్మయ్య కౌలు పొలానికి మాత్రమే బోరును వాడుకోవాలని మాల్యాద్రికి తెలిపాడు. కాని అతను వినకుండా తన సొంత పొలానికి నీటిని వాడుతుండడంతో లక్ష్మయ్య మోటర్‌కు ఉన్న స్టాటర్‌ను తీసేశాడు. దీంతో ఆగ్రహించిన మాల్యాద్రి, అతని కుటుంబ సభ్యులు లక్ష్మయ్యతో గొడవకు దిగారు. అంతేకాకుండా కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. దీంతో లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీఎస్ ఆలస్యానికి బాధ్యులెవరు..?

ఉదయగిరి రూరల్, జూలై 27: ఉపాధ్యాయుల ఇన్‌కంట్యాక్స్ చెల్లింపులకు సంబంధించిన టీడీఎస్ ఇంతవరకు పూర్తి చేయకపోవడంపై బాధ్యులెవరంటూ ఉదయగిరి, సీతారామపురం యూటీఎఫ్ మండల శాఖ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. డీడీవోలు టీడీఎస్ పూర్తి చేసిన తర్వాతే ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా ఈ-ఫైలింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. మే నాటికే పూర్తి కావాల్సిన టీడీఎస్ జూలై ముగుస్తున్నా కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. జూలై 31వ తేదీ నాటికి ఈ-ఫైలింగ్ చేయకపోతే ప్రతి ఉపాధ్యాయుడు రూ.5 వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. యూటీఎఫ్ తరపున రెండు నెలల నుంచి సదరు విషయంపై అడుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉపాధ్యాయులు చెల్లించాల్సిన అపరాధ రుసుంకు డీడీవో బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, జూలై 27: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను గెస్ట్‌ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్ సబ్జెక్టుల ఫ్యాకల్టీలు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టుగ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు ఉండి నీట్, ఏపీఎస్‌ఈటీ, పీహెచ్‌డీ అర్హత ఉన్నవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 31న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9490897509 అనే నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఫ్లెక్సీలను తొలగించండి.. మహాప్రభో..!

వింజమూరు, జూలై 27 : పట్టణంలో వెలిసిన ఫ్లెక్సీలను తీసివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఫ్లెక్సీలతో పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా గాలి వీచినప్పుడు అవి ఊగుతుండడంతో ఎక్కడ ప్రజల మీద పడతాయోనని భయాందోళనకు గురికావాల్సి వస్తుందన్నారు. మెయిన్ సెంటర్, స్కూళ్ల వద్ద ఏర్పాటు చేసి ఉన్న ఫ్లెక్సీలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పంచాయతీ వారు ఫ్లెక్సీలను తొలగించాలని పలువురు కోరుతున్నారు .

30న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు, జూలై 27: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో పారిశుధ్యం, మరుగుదొడ్లు, వైద్యం, ఉపాధిహామి పథకం పనులు, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

పంచాయతీల్లో డబ్బుల్లేవు!

● విద్యుత్ సిబ్బంది కనిపించడంలేదు ● ఉపాధి బిల్లులు ఎప్పుడిస్తారు...? ● సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన



మాట్లాడుతున్న ఎంపీపీ విజయకుమార్

నెల్లూరురూరల్, జూలై 27 : గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేక పాలన వ్యవహారాలు ఇబ్బందిగా మారాయని, సచివాలయాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండటంలేదని, ఉపాధిహామీ పథకం నుంచి రావాల్సిన నిధులు తమ ఖాతాల్లో జమకాలేదని వివిధ పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, ఎంపీటీసీలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శనివారం నెల్లూరురూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బూడిద విజయకుమార్ అధ్యక్షత ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భగా శాఖలవారీగా సమీక్షించారు. కొత్త వెల్లంటిలో విద్యుత్ శాఖకు సంబంధించి సిబ్బందిలేక తానే లైట్లు వేసుకుంటున్నానని వైస్ ఎంపీపీ దేవసేనమ్మ వాపోయారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక ఆర్థికంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు సర్పంచు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది సచివాలయాలకు పూర్తిగా రావడం మానేశారని ఆమంచర్ల కార్యదర్శి తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో జగనన్న లేవుట్లకు లెవలింగ్ చేస్తే ఇంతవరకు ఉపాధి నిధులు అందలేదని ఉప్పుటూరు సర్పంచు వాపోయారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రజలకు దూరమవుతుందని, నానాటికి సేవలు తగ్గిపోతున్నాయని తద్వారా ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, జడ్పీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు అల్లాబక్షు, మొహిద్దీన్‌లు పాల్గొన్నారు.

కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసు సీబీఐకి అప్పగించాలి : సీపీఐ



మాట్లాడుతున్న అరిగెల సాయి

నెల్లూరు(వైద్యం), జూలై 27 : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంతకం ఫోర్జరీపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపి సీబీఐకి అప్పగించాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐఏఎస్ అధికారి సంతకం ఫోర్జరీ చేసిన ఘటనలో పలువురుపై కేసులు నమోదయ్యాయన్నారు. నగరంలో అపార్ట్‌మెంట్‌లు, కమర్షియల్ బిల్డింగ్‌లకు సంబంధించి 10శాతం మార్టిగేజ్ వసూలు చేశారన్నారు. ఇందుకు కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని, దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేయకుండా తెరవెనుక ఎవరు ఉన్నారో పోలీసులు కనిపెట్టాలన్నారు. అయితే రాజకీయ కోణంలో మాత్రమే క్రిమినల్ కేసులు నమోదయినట్లు ఆరోపణలు వస్తున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరంలో ఎన్ని మార్టుగేజ్‌లు చేశారు.. ఎంత వసూలు చేశారో వాస్తవాలు తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు వాంటబేటి నాగేంద్ర, జిలానీఖాన్, లీలామోహన్, ముక్తియార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 27 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, 13, 15, 17, 19 విభాగాలతో పాటు మెన్, ఉమెన్ కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలుంటాయని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచే పోటీలు ప్రారంభమవుతాయని, గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణపత్రంతో హాజరు కావాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, జూలై 27 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఖైదీల యోగాక్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు, తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయసేవలను ఖైదీలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు కే రాజేశ్వరరావు, మహేష్‌బాబు, ఫణికుమార్, లాయర్ హర్ష తదితరులు ఉన్నారు.

టీడీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి

తోటపల్లిగూడూరు, జూలై 27 : టీడీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని టీడీపీ గ్రామ ఉపసర్పంచ్ మేనాటి శీనయ్య తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలోని సచివాలయం, ప్రాథమిక పాఠశాలను శనివారం గ్రామ టీడీపీ నాయకులతో కలిసి ఉపసర్పంచ్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని, వైసీపీ అరాచక పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, పంచాయతీ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో పాఠశాలలో నిర్మించిన ప్రహరీ గోడకు పగుళ్లు రావడంతో త్వరలో ఆ పనులను చేపట్టి పూర్తి చేస్తామని స్కూలు ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో పరుచూరి హరిబాబు, దద్దోలు మనోహర్, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మేనాటి రామయ్య, పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోవూరు, జూలై 27: మండల పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాల్సిందిగా మండల పరిషత్ అధ్యక్షురాలు తుమ్మలపెంట పార్వతి కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రామాంజనేయులు, జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

రాపూరు అభివృద్ధికి సమష్టి కృషి

రాపూరు(డక్కిలి), జూలై 27 : రాపూరు ప్రాంత అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని రాపూరు ఎంపీపీ ప్రసన్న తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు రాపూరు అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం అధికారులు శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ ట్రాలీల పంపిణీ



చెత్త సేకరణ పరికరాలు అందజేస్తున్న సుబ్బారావు

నెల్లూరు(వైద్యం), జూలై 27 : నగరంలోని 47వ డివిజన్‌లో చెత్త సేకరణకు మున్సిపల్ కార్మికులకు శనివారం ట్రాలీలను టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు వితరణ చేశారు. సిటీని నెంబర్ 1గా చేయాలన్న మంత్రి పొంగూరు నారాయణ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నేతలు గణేష్‌కుమార్, అబ్దుల్ రెహమాన్, కే.రాజా, సిద్ధ కళాచారి, మునిశేఖర్, ఆర్కాట్ కృష్ణ, చంద్రశేఖర్, కంచికృష్ణ, వీరమల్ల చంద్ర పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(హరనాథపురం), జూలై 27 : సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య ఆధ్వర్యంలో నేతలు శనివారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు.

పాఠశాలల్లో అట్టహాసంగా శిక్షా సప్తాహ్


ఆమంచర్లలో మొక్కలు నాటుతున్న డీఈవో

నెల్లూరు(విద్య), జూలై 27 : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆమంచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిపేరుతో ఓ మొక్కను డీఈవో రామారావు నాటారు. విద్యార్థులతోనూ మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతను వారికే అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, ఏఎంవో సుధీర్ బాబు, సీఎంవో పెంచలయ్య, ఎంఈవో ఆర్. మురళీధర్, ప్రధానోపా ధ్యాయుడు ఏ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

● కొత్తూరు కేంద్రీయ విద్యాలయంలో శిక్షాసప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మపేరుతో ఓ మొక్క అంటూ విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకరయ్య మాట్లాడుతూ మాతృభూమి సేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని ప్రధాని మోదీ చేపట్టిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులను భాగస్వాములను చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అలివేలు మంగబాయి, ఎకోక్లబ్ కోఆర్డినేటర్ జోషిబాబు, ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు దొరసానమ్మ, ప్రణీత, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం శిక్ష సప్తాహ్ ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా పోషకాహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో కేఎన్ బాలాజీ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు షేక్.అహ్మద్ బాషా, ఉపసర్పంచ్ చావా సుధారాణి, చావా రమేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ షేక్.అజీజ్, పంచాయతీ సెక్రటరీ విజయదుర్గ, పాఠశాల కమిటీ చైర్మన్ ఆర్.స్వాతి, వైస్ చైర్మన్ వి.గిరిజకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు కే.వసంత లక్ష్మి, కే.విద్యుల్లత, బీ.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని పల్లెపాడు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఛాత్రోపధ్యాయులచే తల్లి పేరు మీద ఓ మొక్క కార్యక్రమం కింద మొక్కలు నాటినట్లు డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె వెంకటే శ్వరరావు, డాక్టర్ ఆర్ బాలాజీరావు, ఉపన్యాసకులు కె విజయచంద్ర, కార్యాలయ సూపరింటెండెంట్ ఎం మేరీప్రసూన, పూర్వపు లెక్చరర్ డాక్టర్ బంకా శ్రీనివాసులు, పూర్వపు కార్యాలయ పర్యవేక్షకులు ఎస్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి


వెంకటాచలం: అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, జూలై 27 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశం గౌరవించ దగ్గ, స్ఫూర్తిదాయకమైన శాస్త్రజ్ఞుడు అని కొనియాడారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ వీ వీరారెడ్డి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఆర్ మధుమతి, సుజాఎస్ నాయర్, డాక్టర్ పీ సుజాత, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కోట నీలమణికంఠ, వై విజయ, బీవీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : ప్రపంచం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్త మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం అని బీజేపీ మండల అధ్యక్షుడు గండి రఘురామయ్య అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలోని బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పీర్ల మాన్యం భూముల్లో లేఅవుట్ తగదు


లేఅవుట్ వద్ద మాట్లాడుతున్న ముస్లింలు

నెల్లూరురూరల్, జూలై 27 : ముస్లింల పీర్ల పండుగకు దాతలు ఇచ్చిన భూములను ఆక్రమించి లే అవుట్లు వేశారని, దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపించాలని అల్లీపురంలో కొందరు ముస్లింలు కోరారు. ఈ సందర్భంగా వివాదస్పద భూముల వద్ద శనివారం నజీర్‌బాషా, దస్తగిరి, ఛాన్‌బాషా, చినిగిషా, ఖాలేషా తదితర ముస్లింలు మీడియాతో మాట్లాడుతూ పీర్ల పండుగ నిర్వహణకు 1916లో సర్వే నెం.132-సీ1లో 49 సెంట్ల భూమిని ఇసనాక సుబ్బరామిరెడ్డి దానంగా ఇచ్చారన్నారు. ఈ భూమిని కౌలు చేసుకునే శాశ్వత హక్కును అప్పట్లో కరణంగా ఉన్న పెకటరాజు బుచ్చిరాజుకు వీలునామ ద్వారా కల్పించారన్నారు. ఆయన వద్ద అదే గ్రామానికి చెందిన పొక్కురెడ్డి సేతురామిరెడ్డి లీజుకు తీసుకుని ఆయన ముస్లింలకు లీజు అందచేసే విధంగా రాతలు జరగాయన్నారు. ఈ పరంపర కొనసాగుతుండగా వాళ్ల వంశీకులుకు లీజు హక్కులు బదిలీ జరిగాయన్నారు. ఈ క్రమంలో రాచూరు భాస్కర్‌కు సెటిల్‌మెంట్ డీడ్‌ను 2019లో రికార్డుల్లోకి ఎక్కించారని, అనంతరం అనేకేపల్లికి చెందిన చల్లా రమేష్ అనే వ్యక్తికి ఈ భూమి అమ్మేశారని చెప్పారు. పీర్ల మాన్యంగా ఉన్న భూమి కాస్త వంశపారంగా రికార్డుల్లో ఎక్కించారన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు.

దోమల లార్వా లేకుండా చూసుకోండి

● నీటి నిల్వలను పరిశీలించిన మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు


నీటి నిల్వలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వీర్రాజు

నెల్లూరు(వైద్యం), జూలై 27 : దోమల లార్వా లేకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు హెచ్చరించారు. శనివారం నగరంలోని మనుమసిద్ధినగర్, మల్లికార్జునపురం, చంద్రమౌళినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు నివాసాలను పరిశీలించారు. ఆయా నివాసాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. దోమల లార్వాలు నిల్వ ఉండటంపై స్థానికులకు ఈ నీటి నిల్వలు వల్ల ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయంటూ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు: మండల పరిధిలోని పడుగుపాడు గ్రామం ఒకటో సచివాలయ పరిధిలో వైద్యసిబ్బంది శనివారం ఇంటింటికీ తిరిగి దోమల లార్వా నిర్మూలించారు. ఈ సందర్భంగా జోనల్ అడిషనల్ డైరెక్టర్ జీ వీర్రాజు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇళ్లల్లో దోమల లార్వాను నిర్మూలించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారులు నాగార్జున, నాగరాజు, ఇలియాజ్, సచివాలయ ఏఎన్ఎం భూదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిడిగుంటపాళెంలో మారని అధికారుల వ్యవహారశైలి

● అధికారుల తీరుపై విమర్శలు గుప్పించిన బీజేపీ నేతలు


చదును చేసిన గ్రావెల్‌ను తవ్వుతున్న జేసీబీ

వెంకటాచలం, జూలై 27 : ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మారలేదనే చెప్పవచ్చు. మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలోని వైసీపీ నాయకుల అడుగులకు మడుగులు వత్తుతున్నారని, అధికారుల తీరుపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద గ్రావెల్ తోలి చదును చేశారని, కాని ఆ గ్రావెల్‌ను శనివారం వైసీపీ నాయకులు అక్రమంగా జేసీబీ పెట్టి టాక్టర్లతో తీసుకెళ్లి వారికి సంబంధించిన రొయ్యల గుంటకు వెళ్లే మార్గంలో వేసుకున్నారన్నారు. వైసీపీ నాయకులకు స్థానిక అధికారులు ఇంకా తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వ్రతం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 27 : నగరంలోని మైపాడుగేట్ సెంట ర్‌లోని కేపీఆర్ కళ్యాణ మండపంలో శనివారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి వ్రతం వైభవంగా జరిగింది. ఈ వ్రతం శ్రీపీఠం వ్యవస్థాపకులు, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రధాన అర్చకుడు లలితా శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో జరిగింది. వేలాది మంది భక్తు లు వ్రతంలో పాల్గొన్నారు.

● నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయం చైర్మన్ మన్నెం అరమనాథ్‌రెడ్డి, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని పాండురంగస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం రేవతీ నక్షత్రం సందర్భంగా రుక్మాబాయి సమేత పాండురంగ స్వామికి 11 రకాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాభిషేకాలు జరిగాయి. ఉభయకర్తలుగా చలువాది నాగేశ్వరరావు, రజనీ, చలువాది వైభవ్ శ్రీనివాస్, శ్రీలత, పాదర్తి బాలాజీ, రూపాదేవి దంపతులు వ్యవహరించారు.

● నగరంలోని మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో శనివారం రాత్రి సకల దేవతలకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పల్లకీసేవ కన్నుల పండువగా జరిగింది.

● వేదగిరి లక్ష్మీనరసింహాస్వామి ఆలయం వద్ద ధ్వంసమైన వరాహ స్వామి విగ్రహాన్ని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ బృందం పరిశీలించింది. దీనిపై విచారణ జరిపించి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగుల శ్రీనివాస్, సి.కామేశ్వరరావు, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డిపై విమర్శలు తగవు

నెల్లూరు(హరనాథపురం), జూలై 27 : గిరిజనులకు అండగా నిలుస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై విమర్శలు తగవని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యానాది కులానికి చెందిన మహిళను మేయర్‌గా నిలబెట్టి శ్రీధర్‌రెడ్డి గిరిజన పక్షపాతిగా నిలిచారన్నారు. నగరపాలక సంస్థలో ఫోర్జరీ అంశానికి సంబంధించి కోట్లాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. ఫోర్జరీకి పాల్పడిన వారు, వారిని వెనుకుండి నడిపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫోర్జరీ అంశం గిరిజన జాతి సమస్య కాదన్నారు. మేయర్‌కు సమస్య వచ్చినప్పుడు గిరిజన సంఘ నేతలుగా తాము అండగా నిలిచామని, కానీ వైసీపీ హయాంలో తమను ఇబ్బందులు పెట్టి కేసులు పెట్టినా మేయర్ కనీసం స్పందించలేదన్నారు. కమిషనర్ సంతకాల ఫోర్జరీకి సంబంధించి విచారణకు నిలబడి తమ నిజాయితీని నిరూపించుకోవాలని మేయర్, ఆమె భర్తకు సూచించారు. ఈ సమావేశంలో నేతలు కత్తి ఆదిశేషయ్య, తలపల చంద్రమౌళి, రాపూరి కృష్ణయ్య, మాణికుల మురళి, మాకాని రవీంద్ర, ఎల్లంపల్లి రమేష్, తిరువీధి సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయాలి

నెల్లూరు(విద్య), జూలై 27: విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ఎస్ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 9 రోజులు నిర్వహించిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా దర్గామిట్ట జడ్పీలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యారంగం, విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికల కోసం జిల్లా వ్యాప్తంగా 535 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

30న మిత్రరత్న పురస్కారాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 27: సృజన సాంస్కృతిక వేదిక 150వ కార్యక్రమంగా ఈనెల 30న మిత్రరత్న అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాయి గ్రూప్ చైర్మన్ కోట్టే రామమూర్తి, సింహపురి పెయింట్స్ గ్రూప్స్ అధినేత కోట గురుబ్రహ్మం, శివశంకర్ గ్రూపు చైర్మన్ పి.శంకర్‌లతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు మిత్రరత్న అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 27: నగరంలోని బాలా జీనగర్ శ్రీత్యాగరాజస్వామి కళ్యాణ మండపంలో ఉదయం 10గంటలకు ఆది శైవ బ్రాహ్మణ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కొండకావూరు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, కోశాధికారి ముదివర్తి రవికాంత శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా దేవదేవురుల కల్యాణం



రాపూరు(డక్కిలి), జూలై 27 : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నృసింహ స్వామి ఆలయంలో శనివారం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నృసింహ స్వామి కల్యాణం వేదపండితుల మంత్రోత్సహాల మధ్య వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి కోనకు తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం స్వామి అమ్మవార్లకు తిరుచ్చిపల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిషనర్ సాగర్ బాబు ఏర్పాట్లను పరిశీలించారు.

వైభవంగా పల్లకీసేవ

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 27: నగరంలోని మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష అలంకారం జరిగింది. రాత్రి స్వామివార్లకు ప్రత్యేక పుష్ప పల్లకీలో విశేష అలంకారం చేసి గోవిందనామస్మరణలతో పల్లకీసేవ నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరి పంటల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 27: మండలంలోని వవ్వేరుతో పాటు పలు గ్రామాలలో వరి పంటలను కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్ మండల వ్యవసాయాధికారి పి సురేంద్రరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటలో ఎక్కువగా కాండం తొలుచు పురుగుతో పాటు అక్కడక్కడా కాండం కుళ్లు తెగులు వుందని, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు మీరయ్య, కీర్తన, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైసీపీలో కలకలం

- బెంగళూరు విమానాశ్రయంలో మోహిత్‌రెడ్డి అరెస్టు
- పనిచేయని చెవిరెడ్డి మంత్రాంగం... పలుకుబడి
- నేడు తిరుపతిలో కోర్టుకు హాజరుపరిచే అవకాశం



బెంగళూరు విమానాశ్రయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ విమానమెక్కేందుకు ప్రయత్నిస్తూ తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు కావడం చంద్రగిరి నియోజకవర్గ వైసీపీలో కలకలం రేపింది. అతనితో పాటు దుబాయ్ వెళ్ళేందుకు బయల్దేరిన తండ్రి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తమ్ముడు హర్షిత్‌రెడ్డి ఈ ఘటనతో ప్రయాణం విరమించుకున్నారు. మోహిత్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్న సమయంలో వారితో వాదనకు దిగిన చెవిరెడ్డిని కూడా విమానాశ్రయ అధికారులు నిర్బంధించారు. తండ్రీ కొడుకులు ముగ్గురూ దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించారన్న ప్రచారం మొదలైంది. ఈ ఘటనల నేపధ్యంలో చంద్రగిరి వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థిగా పులివర్తి నాని, వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోటీ పడిన సంగతి తెలిసిందే. పోలింగ్ రోజు రెండు మూడు గ్రామాల్లో జరిగిన ఘర్షణల నేపధ్యంలో పోలింగ్ మరునాడు కౌంటింగు కేంద్రమైన తిరుపతి మహిళా వర్శిటీ ఎదుట టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి అనుచరులు జరిపిన ఈ భయానక దాడిలో నానీ తృటిలో తప్పించుకున్నారు.ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. ప్రతీకార దాడుల్లో పలువురు గాయపడగా, కొన్ని వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. నానీ గన్‌మెన్ జరిపిన కాల్పుల్లో కూడా ఇద్దరు గాయపడ్డారు. పోలింగ్ మరుసటి రోజు ఈవీఎంలు భద్రపరిచిన మహిళా వర్శిటీ ప్రాంగణంలోనే ప్రధాన రాజకీయ పార్టీ అయిన టీడీపీ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై విచారణకు ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే 37మంది అరెస్టు అయి రిమాండులో వున్నారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రోద్బలంతోనే హత్యాయత్నం జరిగిందంటూ కేసులో అతన్ని కూడా నిందితుడిగా చేర్చారు. తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో మోహిత్ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు మరికొంత గడువు కావాలని ప్రాసిక్యూషన్ కోరడంతో వాయిదా వేస్తూ వచ్చింది. తదుపరి విచారణ ఈనెల 29న సోమవారం జరగాల్సి వుంది. అయితే ఈలోపు మోహిత్‌రెడ్డి బెంగళూరు నుంచీ దుబాయ్ వెళ్ళే ప్రయత్నంలో విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడ్డారు. వారు అదుపులోకి తీసుకుని తిరుపతి పోలీసులకు సమాచారమిచ్చారు.అరెస్టు చేసేందుకు తిరుపతి పోలీసులు హుటాహుటిన బెంగళూరు బయల్దేరి వెళ్ళారు. ఆదివారం వేకువజామున మోహిత్‌ను తిరుపతి తీసుకొచ్చి అరెస్టు చూపించే అవకాశముంది.దీంతో హైకోర్టులో మోహిత్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ఇపుడు నిరర్థకమైనట్టుగా భావించాల్సివుంది. హైకోర్టులో కొత్తగా బెయిల్ పిటిషన్ మళ్ళీ వేయాల్సి వుంటుంది.

తండ్రీ కొడుకులు పారిపోయే ప్రయత్నం చేశారంటూ ప్రచారం

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన కుమారులు మోహిత్, హర్షిత్ దుబాయ్ వెళ్ళే క్రమంలో మోహిత్ పట్టుబడడంతో ఈ ముగ్గురూ దుబాయ్ పారిపోయే ప్రయత్నం చేశారన్న ప్రచారం మొదలైంది. వాస్తవానికి పులివర్తి నానీ తనపై జరిగిన హత్యాయత్నం కేసులో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన తనయులు, తమ్ముడు రఘునాథ రెడ్డి తదితరుల పాత్ర వుందని, వారిని నిందితులుగా కేసులో చేర్చాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతానికి మోహిత్‌రెడ్డిని నిందితుడిగా కేసులో చేర్చిన పోలీసులు తర్వాతి దశలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి,కుమారుడు హర్షిత్‌రెడ్డి పేర్లు కూడా కేసులో చేర్చే అవకాశాలు లేకపోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపధ్యంలో కక్ష సాధింపు చర్యలు,వేధింపులు వుంటాయని,ఈ కేసులో అరెస్టు కూడా చేయచ్చనే అంచనాతో తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ వెళ్ళిపోయే ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది.ఇది నిజమైనా కాకపోయినా ఈ తరహా ప్రచారం జరుగుతుండడంతో చంద్రగిరి వైసీపీ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.స్నేహితుడి పెళ్ళి వుంటే మోహిత్ ఒక్కరే బయల్దేరి ఆ క్రమంలో అరెస్టయినా సమాధానం చెప్పుకునే పరిస్థితి వుండేదని, అలా కాకుండా తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ బయల్దేరడం ఈ ప్రచారానికి ఊతమిస్తోందని సొంత పార్టీ వర్గాలు వాపోతున్నాయి. అన్ని స్థాయుల్లో పలుకుబడి, మంత్రాంగం చేయగలిగిన శక్తిసామర్థ్యాలున్న చెవిరెడ్డి తనయుడి అరెస్టును అడ్డుకోలేకపోవడం కూడా శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసినట్టవుతోంది. ఉన్నత న్యాయస్థానాల నుంచీ రక్షణ పొందలేకపోవడం కూడా కార్యకర్తల స్థైర్యం సడలేందుకు కారణమవుతోంది. చెవిరెడ్డి, ఆయన కుటుంబం స్థాయిలోనే ఇలా వుంటే తమ పరిస్థితి ఏమిటన్న ఆలోచన వారిలో ఆందోళన రేకెత్తిస్తోంది. కాగా విదేశాల్లో చదివిన తన కొడుకును వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి శనివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.తన కొడుకు వయసు 25ఏళ్ళని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా జీవితంలోకి వచ్చాడని పేర్కొన్నారు. అలాంటి వాడిని అక్రమ కేసులో అరెస్టు చేయించారని, వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ప్రజల పక్షాన ఏ స్థాయి పోరాటానికైనా తాము సిద్ధంగా వున్నామని ప్రకటించారు.

పోలీసుల అదుపులో పార్థీవ గ్యాంగ్?

- గాజులమండ్యం ఘటనతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఓ ఇంట్లో దొంగతనానికి విఫలయత్నం జరిగింది. ఈ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అన్ని శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, రోడ్లకు ఇరువైపులా గుడిసెలు వేసుకున్న వారిని తనిఖీలు చేశారు. ఎంఆర్‌పల్లె సీఐ అహ్మద్, అలిపిరి ఎస్‌ఐ రాజశేఖర్, చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేసి అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గుడిసెలు, చిన్న, చిన్న రేకుల షెడ్లలో తలదాచుకుని కూలీపనులు పేరుతో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని విచారించారు. ముఖ్యంగా నార్త్ ఇండియా గ్యాంగ్‌లు కొన్ని తిరుపతిలో తలదాచుకున్నట్లు పోలీసులకు అనుమానం రావడంతో ఆ దిశగా తనిఖీలు చేసి కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో పార్థీవ గ్యాంగ్‌కు చెందిన వారు ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ

- 2,67,772 మందికి అందనున్న 113.17కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఆగస్టు ఒకటో తేదీ నుంచి సచివాలయ సిబ్బందే పంపిణీ చేయనున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సిబ్బంది వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిన వారికి మరుసటిరోజు అందజేస్తారని స్పష్టం చేశారు. జిల్లాలో 2,67,772 మంది లబ్ధిదారులకు సుమారు రూ.113.17కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. లబ్ధిదారులు కూడా ఇళ్లవద్దే ఉండి పింఛన్లు తీసుకోవాలని కోరారు.

ఓజిలిలో చెరువుల మరమ్మతులు



నెమళ్ళపూడి చెరువులో జరుగుతున్న మరమ్మతు పనులు

ఓజిలి, జూలై 27 : ఓజిలి మండలంలో 10 చెరువులకు రూ.37 లక్షలతో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. నెమళ్ళపూడి, కరబల్లవోలు, మానమాల, ఆచార్లపార్లపల్లి, ఆరిమేనిపాడుతోపాటు మరో ఐదు చెరువులకు ఈ నిధులను వెచ్చించారు. ఫ్లడ్ డ్యామేజి రిపేర్స్ (ఎఫ్‌డీఆర్) నిధులతో చేపట్టనున్న ఈ మరమ్మతులను వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు నెమళ్ళపూడి చెరువుకు మరమ్మతులు చేపట్టారు. ఇతర చెరువుల మరమ్మతులు ప్రారంభించాల్సివుందని మండల నీటిపారుదల శాఖ ఏఈ వీరాస్వామి తెలిపారు. మండలంలో ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులకు ఈ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూలై 27: రైల్వేకాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ వీవీ రావుకు ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రైల్వేస్టేషన్‌లో పారిశుధ్య కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కార్మిక చట్టాలను అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, మున్నా, ఆసీం, శీను పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గూడూరు అర్బన్, జూలై 27: బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరమని ఐసీడీఎస్ సీడీపీవో మెహబూబీ అన్నారు. శనివారం పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జ్యోతికిరణ్, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

నిమ్మపూత నియంత్రణపై అవగాహన

డక్కిలి, జూలై 27 : నిమ్మ పంటలో మంచి దిగుబడులు రావాలంటే పూత నియంత్రణపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.గోవిందు రాజులు అన్నారు. శనివారం మండలంలోని దగ్గవోలు గ్రామంలో నిమ్మ పూత నియంత్రణపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మలో పూత రావడానికి జిబ్బరెల్లిక్ అమ్లం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. జిబ్బరెల్లిక్ ఆమ్లాన్ని రైతులకు పంపిణీ చేశారు. దానిని నీటిలో కలిపే విధానాన్ని రైతుల పోలాల్లో చూపించి రైతుల చేత పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుపాల్, ఉద్యాన శాస్త్రవేత్త రాజీవన, వెంకటగిరి ఉద్యాన శాఖ అధికారి ఆనందరెడ్డి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన

చిల్లకూరు, జూలై 27: డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై శనివారం మండలంలోని అన్నంబాక గ్రామ రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రైతులు డ్రోన్‌తో పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా కూలీల ఖర్చులను తగ్గించడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చునన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్టె ఎరువులు విరివిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్, ఏడీఏ గోపీనాయక్, ఏవో భవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి డోలాను కలిసిన తెలుగు యువత ఉపాధ్యక్షుడు



సూళ్లూరుపేట, జూలై 27: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామిని సూళ్లూరుపేటకు చెందిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కోస్టల్ కారిడార్ భూముల్లో సర్వేలు వేగవంతం



వేరుశనగ పంటల భూముల్లో సర్వే చేస్తున్న బృందాలు

కోట, జూలై 27 : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ భూములపై 3వ రోజు అయిన శనివారం సర్వే వేగం పుంజుకుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ ఉన్న 444 ఎకరాలలో జీడి మామిడి, వేరుశనగ, సవక పంటలు ఉన్న భూములపై రెవెన్యూశాఖలోని మూడు బృందాలు ఈ సర్వే నిర్వహిస్తున్నాయి. ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్ రామ్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 3వ రోజు వేరుశనగ పంటలు ఉన్న భూముల్లో సర్వే చేశారు.

ఆగివున్న ట్రాలీని ఢీకొన్న బస్సు

తండ్రీకూతుళ్ల దుర్మరణం, 16మందికి గాయాలు





ట్రాలీని ఢీకొని దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు (ఇన్‌సెట్‌లో) మృతురాలు ఝాన్సీరాణి(ఫైల్ ఫొటో)

చిల్లకూరు, జూలై 27: చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఎస్కవేటర్ల లోడుతో ఆగివున్న ట్రాలీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా 16మందికి గాయాలయ్యాయి.సూళ్లూరుపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు 33మంది ప్రయాణికులతో నెల్లూరు వైపు వెళుతోంది. చిల్లకూరు సమీపం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఎస్కవేటర్ల లోడుతో ఓ ట్రాలీ నెల్లూరువైపు వెళుతూ రోడ్డు పక్కన నిలిపివుంది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ట్రాలీని ఢీకొంది.దీంతో బస్సులో వున్న తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట మండలం ఎస్ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన ఝాన్సీరాణి(24) మృతి చెందింది. ఆమె తండ్రి కుమార్(55), మధుబాల, మనీషా, రూపిణి, చిన్నయ్య, అబ్దుల్ రఫీ, కోటేశ్వరి, పోలయ్యజయలక్ష్మి, అనార్కలి, రమణయ్య, నిషాద్‌అహ్మద్, శంకర్, భక్తవత్సలరావు, ప్రవీణ్, మన్మధ కుమార్, ప్రవీణ్‌లకు తీవ్రగాయాలు కాగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని సీఐ వేణుగోపాల రెడ్డి, ఎస్ఐ సుధీర్‌కుమార్ పరిశీలించి గాయపడినవారిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిని ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు.మెరుగైన ఇకిత్స నిమిత్తం కుమార్, మన్మథకుమార్, అబ్దుల్‌రఫీ, పోలయ్యలను నెల్లూరుకు తరలించారు.వీరిలో కుమార్ నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ అనంతలోకాలకు..

ఎస్‌ఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన ఝాన్సీరాణి(24)కి ఇటీవల చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరుజిల్లా గొలగమూడిలోని వెంకయ్య స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు బస్సులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.తండ్రీకూతుళ్ల మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బోధనలో నూతన ఒరవడే టీచ్‌టూల్ లక్ష్యం

జిల్లా ఏఎంవో శివశంకర్



సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా ఏఎంవో శివశంకర్

నాయుడుపేటటౌన్, జూలై27: బోధనలో నూతన ఒరవడే... టీచ్‌టూల్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ఏఎంవో శివశంకర్ అన్నారు. నాయుడుపేట బాలుర ఉన్నత పాఠశాలలో 9 రోజులుగా నిర్వహిస్తున్న టీచ్‌టూల్ ముగింపు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ప్రపంచదేశాల విద్యాప్రాజెక్టు లక్ష్యాలను అనుసరించి టీచ్‌టూల్‌లను రూపొందించారన్నారు. ఈ టీచ్‌టూల్ ద్వారా ఉపాధ్యాయుల తరగతి బోధనల్లో మూడు ఏరియాలు, 9ఎలిమెంట్స్, 28 బిహేవియర్స్‌ను అంచనా వేస్తారన్నారు. తద్వారా విద్యార్థులకు నవ్య బోధన పద్ధతులు అవలంబించే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు బోధనకు వెచ్చించే సమయం, విద్యార్థుల సామాజిక, మానసిక పరిజ్ఞానం, నైపుణ్యం, బోధనాపద్ధతులను కొలమానం చేయడంతో పాటు తరగతి గది నైపుణ్యాలను పెంపొందిస్తారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గూడూరు ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో శాంతి, ఎంఈవోలు మునిరత్నం, చంద్రశేఖర్, చలంబాబు, టీచ్‌టూల్ రీసోర్స్ పర్సన్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే విజయశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 27 : పెళ్లకూరు మండలంలో 90 శాతానికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శనివారం జరిగిన పెళ్లకూరు మండల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు పెళ్లకూరు మండల పరిధిలో గురుకుల పాఠశాలలేని విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పెళ్లకూరు మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పసుపుకండ్రిగలో తాగునీటి సమస్య ఏర్పడి నెలరోజులైనా పట్టించుకోలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జట్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, సర్పంచులు కందమూడి శివకుమార్, శేఖర్‌నాయుడు, సిద్దులయ్య నాయుడు, నరేంద్రయాదవ్, మల్లికార్జునరెడ్డి, పోలయ్య, సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.

చండికా పరమేశ్వరి సేవలో ఎమ్మెల్యే విజయశ్రీ

చిల్లకూరు వడ్డిపాలెంలోని చండికాపరమేశ్వరి ఆలయాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు సందర్శించారు. అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహిస్తుండడంతో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాజమాతాదేవీ ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే దంపతులకు పట్టువస్త్రాలు, తీర్థ ప్రసాదాలు బహూకరించి వేద ఆశీర్వచనం అందించారు.

అప్పుల బాధతో కుదిరి సర్పంచ్ ఆత్మహత్య



బుంగా చెంగయ్య (ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 27: రైలు కింద పడి కుదిరి సర్పంచ్ బుంగా చెంగయ్య (47) ఆత్మహత్య చేసుకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... మండల పరిధిలోని కుదిరి గ్రామానికి చెందిన చెంగయ్య వైసీపీలో ఉంటూ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కొంతకాలంగా పార్టీ నాయకులతో అంటీముట్టనట్లు ఉంటూ వస్తున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో మనస్థాపం చెంది శుక్రవారం ఇంటినుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. రాత్రి 9 గంటలైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. శనివారం ఉదయం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో శవమై కనిపించాడు. రైల్వే పోలీసులు శవాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అనిల్ రెడ్డి కుదిరికి వెళ్లి చెంగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ కాలనీలో యువతకు కౌన్సెలింగ్



వెంకటగిరిలో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

వెంకటగిరి, జూలై 27: వెంకటగిరి 6వ వార్డులోని ఎన్‌టీఆర్ కాలనీలో కొంతమంది ఆకతాయిలు పెట్రేగి పోతున్నారని స్థానికులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖలు రాశారు. ఎన్‌టీఆర్ కాలనీలో 1వ వీధిలో కొందరు ఆకతాయిలు రాత్రి వేళల్లో బైకులపై వేగంగా అటూ ఇటూ తిరుగుతూ మహిళలను వేధిస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆకతాయిలు వేగంగా నడిపే బైకు దృశ్యాలు, నెంబరు ప్లేటుతో సహా ఫొటోలు తీసి లేఖకు జతచేసి ఉప ముఖ్యమంత్రికి పంపారు. పవన్ కల్యాణ్ ఈ ఘటనపై స్పందించి ఎస్పీ సుబ్బరాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు వెంకటగిరి సీఐ సంగమేశ్వరావు ఎన్‌టీఆర్ కాలనీకి చేరుకొని ఆకతాయిల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కాలనీలోని యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

కోట, జూలై 27 : శాసనమండలి మాజీ సభ్యుడు గాదె శ్రీని వాసులు నాయుడుకి నెల్లూరు జిల్లా విశ్రాంత ఉపాధ్యా య సంఘం తరపున పలు సమస్యలపై శనివారం వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం కోట నాయకులు నారాయణరావు, రామిశెట్టిలు తెలిపారు. పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయాలని, 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, గిరిప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామిశెట్టి, నారాయణరావు, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహార విజేతలకు బహుమతులు

కోట, జూలై 27 : జరుగుమల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పౌష్టికాహార ప్రదర్శన జరిగింది. విద్యార్థులు పౌష్టికాహారాన్ని తయారుచేసి ప్రదర్శనకు ఉంచారు. ఉత్తమమైన ఆహారాన్ని ఎంపిక చేసి విజేతలకు ఎంఈవో మస్తానయ్య బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎంఈవో, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

వాకాడు, జూలై 27 : మండలంలోని వాలమేడులో ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు పలువురు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఎంపీడీవో స్పందిస్తూ వాలిమేడులో 100రోజుల పనులు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రతిభకు పురస్కారం

కోట, జూలై 27 : పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో ఉన్న సోలార్ ఏజెన్సీకి ఉత్తమ ప్రతిభా పురస్కారం లభించడంతో శనివారం ఆ ఏజెన్సీ నిర్వాహకుడు గుర్రం వెంకటేశ్వర్లుయాదవ్‌ను శనివారం అభినందించారు. సోలార్ ఏజెన్సీ ద్వారా ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనను హైదరాబాదులో ఎంఆర్‌కేఆర్ అధినేత మాధవీలత అభినందించారు. సోలార్ ఏజెన్సీ ద్వారా ఉత్పత్తులు, ఎగుమతులు చేసినందుకుగాను ఈ అవార్డు ఇచ్చినట్లు వెంకటేశ్వర్లుయాదవ్ తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత గంధమనేని రమేష్ కన్నుమూత



గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (ఫైల్ ఫొటో)

నింద్ర/తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (77) కన్నుమూశారు. స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం ఒరూరుపేటలోని తన నివాసంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందారు. గత మార్చిలో గుండెపోటుకు గురై కోలుకున్నప్పటికీ వయోభారానికి తోడు అనారోగ్యంతో ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటూ శనివారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. పిచ్చాటూరు మండలం పాత శివగిరి గ్రామానికి చెందిన వీరి కుటుంబం తొలి నుంచీ రాజకీయాల్లో కొనసాగుతోంది. తండ్రి సుబ్బానాయుడు, తమ్ముడు శరత్‌చంద్రప్రసాద్ సర్పంచులుగా పనిచేయగా ఆయన చిన్నాన్న, సీపీఐ నాయకుడు శివయ్య గతంలో పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇక రమేష్ చంద్రప్రసాద్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.స్వగ్రామం నింద్ర మండలంలో ఉన్నప్పటికీ పిచ్చాటూరు రాజకీయాల్లో 1980వ దశకంలో అరుణ అతిథిగృహం కేంద్రంగా రాజకీయ చతురత చాటుకుని చక్రం తిప్పారు.ఎన్టీ రామారావుకు ప్రియ శిష్యుడిగా, చంద్రబాబుకు ఆప్తుడిగా ఉంటూ జిల్లా రాజకీయాల్లో రాణించారు.జిల్లా తెలుగుదేశం పార్టీలో 1990, 2000 దశకాల్లో రమేష్ చంద్ర ప్రసాద్ క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలగిన ఆయన పార్టీ అధికారంలో వున్న సమయంలోనే రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.రాజకీయాల్లో వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు.జిల్లావ్యాప్తంగా విస్తృత పరిచయాలున్న ఆయన నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటూ అందరికీ తలలో నాలుకలా వ్యవహరించారు.రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ ఛైర్మన్‌గా, రేణిగుంట మండలంలోని గాజులమండ్యంలో వున్న ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన తమ్ముడు హరీష్ చంద్ర ప్రసాద్ డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేశారు.కాగా రమేష్ చంద్ర ప్రసాద్ అంత్యక్రియలు ప్రస్తుతం వీరి కుటుంబం స్థిరపడిన ఒరూరుపేటలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగివుండే రమేష్ చంద్ర ప్రసాద్ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభిప్రాయపడ్డారు.ఆయన మృతి పట్ల నింద్ర మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం తదితరులు సంతాపం ప్రకటించారు.

నేడు మెగా వైద్య శిబిరం

నాయుడుపేట, జూలై 27 : నాయుడుపేట స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని మల్లికాంబ దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు రామనారాయణ తెలిపారు. షుగర్, బీపీతోపాటు వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే కంటి అద్దాలతోపాటు కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చెన్నైలోని శంకర్ నేత్రాలయంలో చేయనున్నట్లు తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 27: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో శనివారం మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీనివాసులు, జీ చంద్రశేఖర్, ప్రభాకర్, రాము, కుమార్, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

గూడూరు, జూలై 27: పేద మహిళలు స్వశక్తితో ఎదగడమే తమ ట్రస్ట్ లక్ష్యమని బుస్సారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బుస్సారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పేద మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకంటి రామమోహన్‌రావు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, గిరిబాబు, ధనుంజయరెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, నాశిన నాగులు, రాంప్రసాద్, బలరామిరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు దిగడం తగదు

బాలాయపల్లి, జూలై 27: మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కృష్ణవేణిని తొలగించడంలేదని అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు పీహెచ్‌సీ వైద్యాధికారిని బెదిరించడం తగదని జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు చాముండేశ్వరి అన్నారు. చిరుద్యోగులపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని కూటమి ప్రభుత్వం చెబుతున్నా బాలాయపల్లి మండలంలో ఉద్యోగులపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దొరవారిసత్రం, జూలై 27: మండలంలోని వీఎస్‌ఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్థరాత్రి డివైడర్‌ను మోటారు సైకిలిస్టు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుడతోటి వాసు(22) శుక్రవారం రాత్రి మృతి చెందారు. బుదూరు గ్రామానికి చెందిన బుడతోటి వాసు తిరుపతి రుయాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చికిత్సలు పొందాడు. పరిస్థితి విషమించడంతో చెన్నైకు తరలించే క్రమంలో శుక్రవారం అర్థరాత్రి నాయుడుపేట సమీపం వచ్చేసరికి మృతి చెందాడు.

వైభవంగా లక్ష్మీకుంకుమ పూజ



నాయుడుపేట టౌన్, జూలై27: మండలంలోని ఒద్దిగుంటకండ్రిగలో ఉన్న శ్రీరామ ఆలయంలో శనివారం హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లక్ష్మీకుంకుమ పూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మోమిడిలో క్రికెట్ పోటీలు

చిల్లకూరు, జూలై 27: మండలంలోని మోమిడి గ్రామంలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శనివారం పోటాపోటీగా సాగాయి. ఉదయం మోమిడి-బీ, ఏరూరుకాయలపాళెం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏరూరుకాయలపాళెం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. అనంతర బ్యాటింగ్‌కు దిగిన మోమిడి-బీ జట్టు 6.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 77 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం చింతవరం-గుమ్మళ్లదిబ్బ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన చింతవరం జట్టు నిర్ణీత 11 ఓవర్లలో 67 పరుగులు చేసి అలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుమ్మళ్లదిబ్బ జట్టు 10.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి విజయం సాధించింది.

హెల్మెట్ ధారణపై యువతకు అవగాహన

వెంకటగిరి, జూలై 27 : వాహనదారులు హెల్మెట్ లేకుండా బైకులు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని న్యాయవాధి గాంధీ అన్నారు. శనివారం వెంకటగిరి - మెన్నెగుంట మార్గంలో వాహనదారులను ఆపి హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తేజ (23) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈనెల 18న మేనకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజ గాయపడ్డాడు. తిరుపతిలో చికిత్స పొందుతూ తేజ శనివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

లీగల్ అడ్వైజర్‌గా గురునాథం

కోట : తిమ్మానాయుడుపాళెంకు చెందిన గురునాథం ఎస్తేర్‌రాణి ఫౌండేషన్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎస్తేర్‌రాణి శనివారం అధికారంగా ప్రకటించినట్లు గురునాథం తెలిపారు.